నీకో లక్ష్యముండటమే కాదు
దానిని ఎంత త్వరగా వీలైతే అంత
త్వరగా సాధించుకునే వ్యూహ
నైపుణ్యం కూడా ఉండాలి
- అబ్దుల్ కలాం

Truth of News

# సూర్య వాస్తవం

PRGI Reg No: APTEL/26/A4782

http://www.suryavastavam.in

చీఫ్ ఎడిటర్: మొఘల్ ఇర్షాద్ బేగ్

IRS PUBLICATIONS
irspublications12@gmail.com

అన్నమయ్య జిల్లా | సంపుటి: 01 | సంచిక : 360 | మంగళవారం 21 జూలై 2026 | పేజీలు : 8 | వెల రూ.6.50

Circulated from Hyderabad, Vishakapatnam, Rajahmundry, Vijayawada, Guntur, Nellore, Tirupati, Anantapuram, kadapa, kurnool, Warangal, Karimnagar, Nalgonda, Chennai, Bengalore, Mumbai, New Delhi


## పోటెత్తిన యువతరంగం

- ఉద్రిక్తంగా పార్లమెంట్ మార్చ్
-యువతపై లాఠీచార్జీ, టియర్‌గ్యాస్, వాటర్‌కెనాన్స్ ప్రయోగం
-ఇంటర్నెట్, మొబైల్ నెట్‌వర్క్ నిలిపివేత
-లాఠీదెబ్బలు తింటూనే పార్లమెంట్ సమీపంలోకి దూసుకెళ్లిన ఆందోళన కారులు ఉలిక్కిపడిన కేంద్రం
-సీజేపీ నేతలతో కేంద్రమంత్రుల చర్చలు
-అమిత్‌షాతో విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ భేటీ



న్యూఢిల్లీ - సూర్య వాస్తవం

ఢిల్లీ ఉలిక్కి పడింది. దేశ యువతలోని ఆవేశం, ఆక్రోశం, ఆవేదన, ఆందోళనను తక్కువ అంచనా వేసిన కేంద్రం యువతరం పట్టుదలను చూసి ఖంగుతింది. నీట్ పేపర్ లీక్, సీబీఎస్ఈలో అవకతవకలకు బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని, ఎన్టీఏను రద్దు చేయాలని, ఎన్ఈపీని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) చేపట్టిన 'పార్లమెంట్ మార్చ్' ఉద్రిక్తంగా మారింది. ఢిల్లీలో భారీ వర్షం కురుస్తున్నా విద్యార్థులు, యువత

- మిగతా 2లో..

## దద్దరిల్లిన పార్లమెంట్

- రామ మందిరంలో విరాళాల చోరీ, నీట్ ప్రశ్నాపత్రం లీక్ వ్యవహారంపై ప్రతిపక్షాల నిలదీత
- ఆరు సార్లు వాయిదా పడిన ఉభయ సభలు సభ నేటికి వాయిదా



న్యూఢిల్లీ - సూర్య వాస్తవం

పార్లమెంట్ వర్షాకాల సమావేశాల తొలిరోజే పార్లమెంట్ దద్దరిల్లింది. నీట్ ప్రశ్నాపత్రం లీక్, అయోధ్య రామ మందిరంలో విరాళాల చోరీ వంటి అంశాలపై చర్చకు ప్రతిపక్షాలు పట్టుబట్టాయి. దీనికి ప్రభుత్వం విముఖత వ్యక్తం చేయడంతో ప్రతిపక్ష సభ్యులు ఆందోళన చేపట్టారు. దీంతో పార్లమెంట్ ఉభయ సభలు ఆరు సార్లు వాయిదాపడ్డాయి. చివరికి నేటి(మంగళవారం)కి సభ వాయిదా పడింది. సోమవారం లోక్‌సభను స్పీకర్ ఓం బిర్లా ప్రారంభిస్తూ ప్రశ్నోత్తరాలు నిర్వహించేందుకు సిద్ధపడ్డారు. అయితే ప్రతిపక్షాలు నీట్ ప్రశ్నాపత్రం లీక్, అయోధ్య రామ మందిరంలోని విరాళాల దొంగతనంపై చర్చకు డిమాండ్ చేశాయి. ప్రతిపక్ష సభ్యులు తమ తమ స్థానాల్లో నుంచే లేచి నినాదాలు హోరెత్తించారు. సభ్యులు సంయమనం పాటించాలని స్పీకర్ ఓం బిర్లా విజ్ఞప్తి చేశారు. నినాదాలతో సభ పని

- మిగతా 3లో..



## రామమందిర విరాళాల కేసు రాజకీయం చేయవద్దు

- సుప్రీంకోర్టు హెచ్చరిక
-అయోధ్య విరాళాల దొంగతనం కేసును రాజకీయం చేయవద్దని సుప్రీంకోర్టు
- ఇది కేవలం నేరానికి సంబంధించిన సాధారణ కేసు అన్న ధర్మాసనం
- సీబీఐ విచారణ కోరుతూ దాఖలైన పిటిషన్లపై కోర్టు విచారణ
- యూపీ పోలీసుల దర్యాప్తుపై నివేదికను పరిశీలించిన సర్వోన్నత న్యాయస్థానం

2లో



## దీక్షను కొనసాగిస్తా: సోనమ్ వాంగ్‌చుక్


న్యూఢిల్లీ - సూర్య వాస్తవం

తన నిరాహార దీక్షను కొనసాగిస్తానని సామాజిక కార్యకర్త సోనమ్ వాంగ్‌చుక్ వెల్లడించారు. ఈ మేరకు సోమవారం ఆయన సతీమణి గీతాంజలి అంగ్మో సోషల్ మీడియా ఎక్స్ వేదికగా తెలియజేశారు. పార్లమెంట్ లో ఎంపీలు తమతో చర్చలు సాగించినప్పుడు లేదా, ఆస్పత్రిలో తనతో స్వయంగా సంప్రదింపులు జరపాలని డిమాండ్ చేశారు. "నేను నా నిరాహార

- మిగతా 2లో..

## ఆగస్టు 1న భోగాపురం ఎయిర్‌పోర్ట్ ప్రారంభోత్సవం...

- ఏర్పాట్లపై సీఎం చంద్రబాబు ఉన్నతస్థాయి సమీక్ష
- ఉత్తరాంధ్రకు ఇది మణిహారంగా నిలుస్తుందన్న సీఎం చంద్రబాబు
- ఎయిర్‌పోర్ట్‌తో పాటు పలు విద్యా, నైపుణ్య కేంద్రాలకు శ్రీకారం
- భూములిచ్చిన రైతులకు గౌరవంగా ఉచిత విమాన ప్రయాణ సౌకర్యం
- ప్రారంభోత్సవ వేడుకపై పది రోజుల పాటు విస్తృత ప్రచారానికి ఆదేశం



అమరావతి- సూర్య వాస్తవం

ఉత్తరాంధ్ర ప్రజల దశాబ్దాల కలను సాకారం చేస్తూ భోగాపురంలో ప్రతిష్ఠాత్మకంగా నిర్మించిన అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానా శ్రయం ప్రారంభోత్సవానికి సిద్ధమవుతోంది. ఆగస్టు 1వ తేదీన ప్రధాని నరేంద్ర మోదీ చేతుల మీదుగా ఈ విమానాశ్రయాన్ని లాంఛనంగా ప్రారంభించనున్నారు. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి చంద్రబాబు సోమవారం ఉన్నతాధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ విమానాశ్రయం ఉత్తరాంధ్రకు మణిహారంగా నిలుస్తుందని, దీని ప్రారంభోత్సవాన్ని ఒక చారిత్రాత్మక ఘట్టంగా, అత్యంత వైభవంగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. ప్రధాని మోదీ పర్యటన సందర్భంగా ఉత్తరాంధ్ర సంస్కృతీ సంప్రదాయాలు ప్రతిబింబించేలా ఘన స్వాగతం పలకాలని సీఎం సూచించారు. థింసా, సవర, కొమ్ము కోయ వంటి గిరిజన సంప్రదాయ నృత్య రూపాలతో ఆయనకు స్వాగతం పలకాలని తెలిపారు. ఈ పర్యటనలో ప్రధాని మోదీ విమానాశ్రయ పాసింజర్ టెర్మినల్ భవనాన్ని ప్రారంభించడంతో పాటు, జీఎంఆర్ స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్, ఏవియేషన్ హబ్-యూనివర్సిటీ, జీఎంఆర్-మాన్సాస్ ఎడ్యుసిటీలకు కూడా శ్రీకారం చుట్టనున్నారని అధికారులు వివరించారు. ఈ విమానాశ్రయం కేవలం ప్రయాణానికే కాకుండా, ఒక కీలకమైన లాజిస్టిక్స్ కేంద్రంగా మారి ప్రపంచవ్యాప్త కనెక్టివిటీని అందిస్తుందని, తద్వారా రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి ఒక "గేమ్ ఛేంజర్" అవుతుందని చంద్రబాబు స్పష్టం చేశారు.

ఈ ప్రాజెక్టు కోసం భూములు త్యాగం చేసిన రైతులు, యజమానులను గౌరవించేలా వారికి ఒకసారి ఉచిత విమాన ప్రయాణ అవకాశం క[illegible] అధికారులను

- మిగతా 2లో..



## విద్యార్థులపై దాడి అప్రజాస్వామికం

- యువతపై లాఠీచార్జీ..స్పందించిన రాహుల్ గాంధీ

న్యూఢిల్లీ - సూర్య వాస్తవం

కాక్రోచ్ పార్టీ సోమవారం చేపట్టిన చలో పార్లమెంట్ యాత్రపై ఢిల్లీ పోలీసులు లాఠీచార్జీ చేసిన విషయం తెలిసిందే. శాంతియుతంగా జంతర్ మంతర్ నుంచి పార్లమెంట్ వైపు సాగుతున్న యువతను పోలీస్ బలగాలు అడ్డగించాయి. ఎలాంటి హెచ్చరికలు లేకుండానే వారిపై పోలీసులు లాఠీచార్జీ చేశారు. ఈ ఘటనపై కేంద్ర ప్రభుత్వం వ్యవహరించిన తీరును ప్రతిపక్షనేత రాహుల్ గాంధీ ఖండించారు. ప్రజాస్వామ్య దేశంలో ఈ తరహా చర్య సరైంది కాదని మండిపడ్డారు. "యువత చేస్తున్న పనిలో ఏమాత్రం తప్పు లేదని, కానీ ప్రభుత్వం, పోలీసులు వ్యవహరిస్తున్న

- మిగతా 2లో..



ప్రముఖ నటుడు 'యాక్షన్ కింగ్' అర్జున్ సర్జా కర్ణాటక ముఖ్యమంత్రి డి.కె. శివకుమార్ ను బెంగళూరులోని విధానసౌధంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ భేటీ పూర్తిగా వ్యక్తిగతమైనది అని తెలుస్తోంది

## ప్రశ్నిస్తున్న యువతపై దాడులు బీజేపీ భయానికి నిదర్శనం

- ఢిల్లీలో విద్యార్థులపై లాఠీఛార్జ్..
- కేంద్ర ప్రభుత్వ వైఖరిని తీవ్రంగా ఖండించిన సీఎం రేవంత్ రెడ్డి
- కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలని డిమాండ్
- విద్యార్థులకు అండగా ఉంటానని స్పష్టం చేసిన రేవంత్



హైదరాబాద్ - సూర్య వాస్తవం

నీట్-యూజీ 2026 పరీక్ష నిర్వహణలో చోటుచేసుకున్న అవకతవకలపై దేశ రాజధాని ఢిల్లీలో నిరసన తెలుపుతున్న విద్యార్థులపై పోలీసుల చర్యను తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్రంగా ఖండించారు. శాంతియుతంగా ఆందోళన నిర్వహిస్తున్న వారిపై లాఠీఛార్జ్ చేయడం, బాష్పవాయువు ప్రయోగించడం అత్యంత దారుణమని ఆయన పేర్కొన్నారు. ఈ విషయంలో విద్యార్థులకు ఆయన తన పూర్తి మద్దతు ప్రకటించారు. సోషల్ మీడియా వేదికగా స్పందించిన రేవంత్ రెడ్డి, విద్యార్థుల భవిష్యత్తును అంధకారం లోకి నెట్టిన కేంద్ర ప్రభుత్వం, ఇప్పుడు వారి గొంతు నొక్కేందుకు పోలీసు బలగా లను ప్రయోగిస్తోందని ఆరోపించారు. "నిరసన తెలుపుతున్న విద్యార్థులపై పడిన ప్రతి దెబ్బ.. ప్రశ్నలన్నా, నిజమన్నా బీజేపీకి ఉన్న భయాన్ని బహిర్గతం చేస్తోంది. నీట్ కుంభకోణంపై కేంద్రం ప్రభుత్వం జవాబుదారీతనం వహించాలి. దేశవ్యాప్తంగా ఉన్న విద్యార్థులకు నేను ఎల్లప్పుడూ అండగా ఉంటాను" అని తన పోస్ట్‌లో పేర్కొన్నారు. పార్లమెంట్ వర్షాకాల సమావేశాల తొలిరోజైన సోమవారం, కాక్రోచ్ జనతా పార్టీ ఆధ్వర్యంలో విద్యార్థులు 'ఛలో పార్లమెంట్' కార్యక్రమాన్ని చేపట్టారు. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని, నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్టీఏ)లో సమూల సంస్కరణలు తీసుకురావాలని డిమాండ్ చేస్తూ వారు పార్లమెంట్ వైపు ర్యాలీగా వెళ్లేందుకు ప్రయత్నించారు. అయితే, అనుమతి లేదంటూ పోలీసులు వారిని అడ్డుకోవడం తో అక్కడ ఉద్రిక్తత చోటుచేసుకుంది. ఆందోళనకారులను చెదరగొట్టేందుకు పోలీసులు లాఠీఛార్జ్ చేయడంతో పాటు టియర్ గ్యాస్ ప్రయోగించారు. ఈ ఘటనలో పలువురు విద్యార్థులకు గాయాలయ్యాయి.


సూర్య వాస్తవం దినపత్రికలోని మరిన్ని వార్తల కోసం సంప్రదించండి

## రామమందిర విరాళాల కేసు
# రాజకీయం చేయవద్దు

న్యూఢిల్లీ – సూర్య వాస్తవం

అయోధ్యలోని శ్రీరామ జన్మభూమి మందిర విరాళాల దారిమళ్లింపు కేసును రాజకీయం చేయ వద్దని సుప్రీంకోర్టు సోమవారం తీవ్రంగా హెచ్చ రించింది. ఈ కేసులో సీబీఐ విచారణ జరిపించా లని, ట్రస్టు ఆర్థిక లావాదేవీలపై స్వతంత్ర ఆడిట్ నిర్వహించాలని కోరుతూ దాఖలైన పలు పిటిషన్ల విచారణ సందర్భంగా ధర్మాసనం ఈ వ్యాఖ్యలు చేసింది. భారత ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం ఈ పిటిషన్లను విచారించింది. "ఇది కేవలం నేరపూరిత చర్యకు సంబంధించిన ఒక సాధారణ కేసు. ఈ అంశాన్ని రాజకీయం చేయవద్దని మేము హెచ్చరిస్తున్నాము" అని ధర్మాసనం స్పష్టం చేసింది. ఈ కేసులో ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం చేపడుతున్న దర్యాప్తు పురోగతిపై సమర్పించిన నివేదికను పరిశీలించిన తర్వాత తగిన ఆదేశాలు జారీ చేస్తామని కోర్టు పేర్కొంది.

భక్తులు సమర్పించిన నగదు, బంగారం, వెండి వంటి విలువైన వస్తువులను శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్టులోని కొందరు వ్యక్తులు దారిమళ్లించారన్న ఆరోపణలతో ఈ వివాదం మొదలైంది. యూపీ ప్రభుత్వం నియమించిన ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) ప్రాథమిక విచారణ అనంతరం ఎఫ్ఐఆర్ నమోదు చేసింది. ఈ కేసులో ఇప్పటివరకు ఎనిమిది మందిని అరెస్టు చేసినట్లు కేంద్ర సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా కోర్టుకు వివరించారు. దర్యాప్తు కొనసాగుతున్నందున, మరిన్ని వివరాలను ప్రస్తుతం బహిర్గతం చేయలేమని ఆయన తెలిపారు. ఈ కేసులో నిష్పక్ష పాతంగా దర్యాప్తు జరిగేలా సిట్‌ను పునర్వ్యవస్థీకరించే అంశంపై సూచనలు తీసుకోవాలని కేంద్రాన్ని కోర్టు ఆదేశించింది. అయితే, తప్పుడు ప్రచారాలకు ఆస్కారం ఉంటుందన్న కారణంతో ఎఫ్ఐఆర్, దర్యాప్తు నివేదికలను ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంచాలన్న అభ్యర్థనను న్యాయస్థానం తిరస్కరించింది. పారదర్శకత కోసం పక్కాగా రికార్డులను నిర్వహించాలని స్పష్టం చేస్తూ, తదుపరి విచారణను వాయిదా వేసింది.

పిటిషనర్ల తరఫున హాజరైన సీనియర్ న్యాయవాది దేవదత్ కామత్ వాదనలు వినిపిస్తూ, బంగారం, వెండి వస్తువులు అదృశ్యమవుతున్నాయని, విరాళాలకు సరైన లెక్కలు లేవని ఆందోళన వ్యక్తం చేశారు. ఆలయ నిర్మాణ సమయంలో భక్తులకు జారీ చేసిన రసీదులను ఒక వెబ్‌సైట్‌లో ఉంచాలని, తద్వారా దాతలు తమ విరాళాలు ట్రస్ట్‌కు చేరాయో లేదో సరిచూసుకోవచ్చని ఆయన సూచించారు. అయితే, ఈ ప్రతిపాదనను ప్రధాన న్యాయమూర్తి తోసిపుచ్చారు.

# దీక్షను కొనసాగిస్తా: సోనమ్ వాంగ్‌చుక్

(మొదటి పేజీ తరువాయి)

దీక్షను (23వ రోజు) కొనసాగిస్తాను. శాంతియుతంగా నిరసన తెలుపుతున్న యువత పట్ల ప్రదర్శిస్తున్న అమానుషత్వాన్ని చూసి, యువ నాయకులకు పార్లమెంట్ భవన్‌లో ఎంపీలను కలిసే అవకాశం లభించే వరకు లేదా వారు ఇక్కడ ఆసుపత్రిలో నన్ను కలిసే అవకాశం లభించే వరకు నా దీక్షను కొనసాగించాలని నిర్ణయించుకున్నాను," అని వాంగ్‌చుక్ ఆ లేఖలో పేర్కొన్నారు. జూన్ 28వ తేదీన ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద ఆయన ఈ దీక్ష ప్రారంభించారు. అయితే ఢిల్లీ హైకోర్టు ఆదేశాల నేపథ్యంలో జంతర్ మంతర్ వద్ద ఆయన చేస్తున్న దీక్షను పోలీసులు భగ్నం చేశారు. అనంతరం ఆయన్ని సఫ్దర్ జంగ్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ కూడా ఆయన తన దీక్షను కొనసాగించారు. కాక్రోచ్ పార్టీ జులై 20వ తేదీన చేపట్టిన చలో పార్లమెంట్ యాత్రకు కూడా ఆయన మద్దతు ప్రకటించిన విషయం విదితమే.

# ఆగస్టు 1న భోగాపురం ఎయిర్‌పోర్ట్ ప్రారంభోత్సవం...

(మొదటి పేజీ తరువాయి)

ఆదేశించడం విశేషం. ప్రారంభోత్సవం సందర్భంగా భారీ బహిరంగ సభను నిర్వహించాలని, సభకు వచ్చే ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ట్రాఫిక్ మళ్లింపు, ప్రత్యేక పార్కింగ్ స్లాట్లు, పటిష్ఠ భద్రతా ఏర్పాట్లు చేయాలని నిర్దేశించారు. హాజరయ్యే వారి కోసం అల్పాహారం, భోజనం, తాగునీటి సదుపాయాలు కల్పించాలని స్పష్టం చేశారు. ఈ చారిత్రాత్మక ఘట్టంపై జూలై 21 నుంచి 31 వరకు పది రోజుల పాటు విస్తృతంగా ప్రచారం నిర్వహించాలని సీఎం సూచించారు. ఉత్తరాంధ్రలోని ప్రతి ఇంటికీ ఈ వేడుక స్ఫూర్తి చేరేలా కార్యక్రమాలు చేపట్టాలన్నారు. అంతర్జాతీయ వేదికలపై ప్రధాని మోదీ స్వయంగా ప్రమోట్ చేస్తున్న అరకు కాఫీ బ్రాండింగ్‌కు కూడా ఈ కార్యక్రమాన్ని వేదికగా మలచాలని చంద్రబాబు సూచించారు. ఈ కార్యక్రమాల్లో ఉత్తరాంధ్రకు చెందిన ప్రజాప్రతినిధులంతా భాగస్వాములు కావాలని ఆదేశించారు. ఈ సమీక్షా సమావేశంలో హోం మంత్రి అనిత, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సాయి ప్రసాద్, పరిశ్రమల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం.టి. కృష్ణబాబు, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, సివిల్ ఏవియేషన్ అధికారులు, జీఎంఆర్ ప్రతినిధులు పాల్గొన్నారు.

**గిరిజన సమస్యలపై త్వరలో చర్చలు.. జీవో 3పై సీఎం చంద్రబాబు కీలక సమీక్ష**

గిరిజన హక్కులకు తమ ప్రభుత్వం ప్రథమ ప్రాధాన్యం ఇస్తుందని, వారి సమస్యలపై చర్చించేందుకు త్వరలోనే గిరిజన సంఘాలతో సమావేశం కావాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. సోమవారం సచివాలయంలో గిరిజన సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలపై ఆయన ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. గిరిజనులకు సంబంధించిన పలు కీలక అంశాలపై ఈ సమావేశంలో చర్చించారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడుతూ, గత ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగానే షెడ్యూల్డ్ ప్రాంతాల్లో గిరిజనులకు 100 శాతం రిజర్వేషన్లు కల్పించే జీవో నెంబర్ 3ని సుప్రీంకోర్టు రద్దు చేసిందని విమర్శించారు. "2000 సంవత్సరంలో మేం తెచ్చిన ఈ జీవోను కాపాడటంలో గత ప్రభుత్వం విఫలమైంది. ఇప్పుడు దీని ప్రయోజనాలను గిరిజనులకు తిరిగి అందించేందుకు ఉన్న అన్ని ప్రత్యామ్నాయాలను పరిశీలిస్తున్నాం. సుప్రీంకోర్టు తీర్పునకు లోబడి ఎలా న్యాయం చేయాలనే దానిపై కసరత్తు చేస్తున్నాం" అని ఆయన వివరించారు. ఈ ప్రక్రియలో గిరిజన సంఘాలను భాగస్వాములను చేయాలని, వారి సూచనలు కూడా తీసుకోవాలని సీఎం అధికారులకు సూచించారు. సమీక్షలో భాగంగా అల్లూరి సీతారామరాజు జిల్లాను జోన్ 1లోకి, పోలవరం జిల్లాను జోన్ 2లోకి మార్చాలని ఆదేశాలు జారీ చేశారు. బాక్సైట్ విషయంలో గిరిజనులు ఆందోళన చెందవద్దని, వారి హక్కులకు వ్యతిరేకంగా ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోదని హామీ ఇచ్చారు. 1/70 చట్టం అమలుపై కూడా ఎటువంటి అనుమానాలు అవసరం లేదని సీఎం స్పష్టం చేశారు. ఈ సమీక్షలో గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సంధ్యారాణి, సీఎస్ సాయి ప్రసాద్, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# విద్యార్థులపై దాడి అప్రజాస్వామికం

(మొదటి పేజీ తరువాయి)

తీరు మాత్రం అత్యంత అసహ్యకరమైనది. విద్యార్థులపై బాష్పవాయువు ప్రయోగించడం, లాఠీఛార్జ్ చేయడం వంటివి ఏమాత్రం సరైన ప్రవర్తన కాదు, ఇది ప్రజాస్వామ్యయుత భారతీయ విధానం కాదు , ఇలా వ్యవహరించడం హేయమైన చర్య," అని రాహుల్ గాంధీ సోషల్ మీడియా వేదికగా ఒక వీడియో సందేశంలో పేర్కొన్నారు.

# పోటెత్తిన యువతరంగం

(మొదటి పేజీ తరువాయి)

స్వచ్ఛందంగా భారీ సంఖ్యలో పార్లమెంటు ప్రాంగణానికి చేరుకునే ప్రయత్నం చేశారు. వారిని చెదరగొట్టేందుకు కేంద్ర బలగాలు, పోలీసులు లాఠీచార్జ్ చేశారు. టియర్‌గ్యాస్ ప్రయోగించారు. వాటర్ కెనాన్స్‌తో యువతను చెదరగొట్టే ప్రయత్నం చేశారు. చేతుల్లో జాతీయ జెండాలు, అంబేద్కర్, భగత్ సింగ్, మహాత్మాగాంధీ చిత్ర పటాలతో లాఠీదెబ్బలు తింటూనే యువత పార్లమెంటు భవనం సమీపంలోకి చొచ్చుకెళ్లింది.

ఈ ఘటనలో అనేక మంది యువతీ యువకులు, విద్యార్థులు గాయపడ్డారు. వందలాది మందిని అరెస్టు చేసి ఢిల్లీలోని వివిధ పోలీస్ స్టేషన్లకు తరలించారు. అయినా యువతరం బెదరలేదు. మరోవైపు పార్లమెంటులోనూ ప్రతిపక్షాలు ప్రభుత్వంపై విరుచుకుపడ్డాయి. సీజేపీ డిమాండ్లలో తప్పు ఏముందో చెప్పాలంటూ కేంద్ర మంత్రుల్ని నిలదీశారు. సర్కారు లోపాలు, బాధ్యతారాహిత్యానికి బాధ్యులు ఎవరని ప్రశ్నించాయి. ఇంటా, బయట పరిస్థితులు తీవ్ర ఉద్రిక్తంగా మారడంతో కేంద్రం దిగిరాక తప్పలేదు. కేంద్ర మంత్రి జేపీ నడ్డా సీజేపీ నాయకులతో చర్చలు జరిపారు. ఈ సందర్భంగా నాయకులు తమ మూడు ప్రధాన డిమాండ్లను ఆయన వద్ద పునరుద్ఘాటించారు. మరోవైపు కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ హోంమంత్రి అమిత్‌షాతో భేటీ అయ్యారు. పర్యావరణ కార్యకర్త సోనమ్ వాంగ్‌చుక్ ఆస్పత్రిలో నిరాహార దీక్షను కొనసాగిస్తున్నారు. సీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే, ఎస్ఎఫ్ఐ నేతలు ఆదర్శ ఎం.సాజీ, ఆయుషీ ఘోష్, ఏఐఎస్ఎఫ్ నాయకులు నేహా, మనీష్, అమీన్ లు తమ దీక్షల్ని విరమించారు. న్యాయం జరిగే వరకు తమ పోరాటం కొనసాగుతుందని తేల్చిచెప్పారు.

**ఆందోళనకారులతో నిండిన జంతర్‌మంతర్??**

సీజేపీ నేతృత్వంలో చేపట్టిన పార్లమెంట్ మార్చ్‌తో ఢిల్లీ జంతర్‌మంతర్ యువతరంతో నిండిపోయింది. విద్యార్థులు, యువతీ యువకులు భారీ సంఖ్యలో స్వచ్ఛందంగా అక్కడకు తరలివచ్చారు. వారి నిరసనలతో దేశ రాజధాని స్తంభించింది. భారీ వర్షం కురుస్తున్నా, పోలీసుల ఆంక్షలు హెచ్చరిస్తున్నా యువతరం ఎక్కడా బెదరలేదు. సోమవారం ఉదయాన్నే దేశం నలుమూలల నుంచి పెద్ద ఎత్తున విద్యార్థులు, యువత, మద్దతుదారులు జంతర్ మంతర్ వద్దకు చేరుకున్నారు. వారికి సంఘీభావంగా పలువురు సినీ నటులు, రాజకీయ నేతలు, ప్రజాస్వామ్యవాదులు, హక్కుల కార్యకర్తలు ఈ ఆందోళనలో పాల్గొన్నారు.

**ఎక్కడికక్కడ అడ్డగింతలు**

పార్లమెంటు సమావేశాల ప్రారంభానికి ముందే దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి భారీగా తరలి వచ్చిన విద్యార్థులను పోలీసులు, కేంద్ర బలగాలు మెట్రో స్టేషన్లు, ఇతర ప్రాంతాల వద్దే అడ్డుకున్నాయి. జంతర్‌మంతర్ వద్దకు వెళ్లకుండా కట్టడి చేసే ప్రయత్నం చేశాయి. సీజేపీ చీఫ్ అభిజీత్ దీప్కే కు మద్దతు తెలిపేందుకు వచ్చిన పార్లమెంట్ సభ్యులు, రాజకీయ నేతలు, ఇతర ప్రముఖులను కూడా పోలీసులు అడ్డుకున్నారు. దీంతో వారు పోలీసులతో వాగ్వాదానికి దిగడంతో అక్కడ కొద్దిసేపు తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. చివరకు నేతలు దీప్కే నిరాహార దీక్ష చేపట్టిన వేదిక వద్దకు చేరుకొని సంఘీభావం తెలిపారు. మరోవైపు ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్, పారా మిలటరీ బలగాలతో ఢిల్లీ పోలీసులు అడుగడుగునా ఆంక్షలు విధించారు. వాటర్ కెనాన్లు, టియర్ గ్యాస్ లను ప్రయోగించారు. చుట్టూ బారికేడ్లు, ఫెన్సింగ్ లతో విద్యార్థులు, యువతను నిర్బంధించారు. వారిపై పోలీసులు జులుం ప్రదర్శించారు. పోలీసుల లాఠీచార్జ్‌తో వందలాది మందికి గాయాలయ్యాయి. ఈ–డ్రోన్ వీడియోలో జంతర్ మంతర్ తో పాటు కిలోమీటర్ల పొడవున ఆందోళన కారులు బారులు తీరి కనిపించారు. ఆ పక్కనే ఉన్న పార్లమెంట్ స్ట్రీట్, రెసినా హిల్స్, ఇండియా గేట్, రాజేంద్ర ప్రసాద్ రోడ్, సెంట్రల్ ఢిల్లీ మొత్తం విద్యార్థులతో నిండిపోయింది.

**పార్లమెంట్ సమీపానికి విద్యార్థులు, యువత**

మధ్యాహ్నం తరువాత జంతర్ మంతర్ నుంచి కిలో మీటర్ దూరంలో ఉన్న పార్లమెంట్ వైపునకు పెద్ద సంఖ్యలో ఆందోళనకారులు కదిలారు. జాతీయ జెండాలు, అంబేద్కర్, భగత్ సింగ్, మహాత్మా గాంధీ తదితర ప్రముఖుల చిత్ర పటాలను చేతిలో పట్టుకొని శాంతియుతంగా నినాదాలతో ముందుకు సాగారు. కొందరు సంసద్ మార్గ్ వైపు నుంచి పార్లమెంట్ చేరుకునేందుకు ప్రయత్నించారు. వారిని భద్రతా బలగాలు అడ్డుకున్నాయి.

నిరసనకారులపై పోలీసులు లాఠీలు ఝుళిపించారు. పలువురికి గాయాలయ్యాయి. వీరికి అక్కడికక్కడే ప్రథమ చికిత్స అందించారు. మరోవైపు జంతర్ మంతర్ సర్కిల్ వద్ద నుంచి మరికొంత మంది పార్లమెంట్ వైపు కదం తొక్కారు. వీరిని పోలీసులు నిలువరించే ప్రయత్నం చేశారు. వేలాది సంఖ్యలో ఉన్న ఆందోళనకారులను అడ్డుకోవడం భద్రతా బలగాలకు సాధ్యం కాలేదు. నిర్బంధాలను ఎదుర్కొంటూ, లాఠీదెబ్బలు తింటూఆదే మార్గంలో ముందుకు నడుస్తూ, రైసినా హిల్స్ మీదుగా పార్లమెంట్ వైపునకు వెళ్లారు. ఈ సందర్భంగా రైల్ భవన్, పార్లమెంట్ సమీపాన ఉన్న ప్రెస్ క్లబ్ ఆఫ్ ఇండియా దగ్గర విద్యార్థులు, యువతపై ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్ భాష్ప వాయువు(టియర్ గ్యాస్)ను ప్రయోగించింది. అనంతరం లాఠీచార్జ్ చేసి విద్యార్థులు, యువతపై తీవ్రంగా విరుచుకుపడ్డారు.

**పార్లమెంట్ మెయిన్ గేట్ మూసివేత**

సీజేపీ మార్చ్ పార్లమెంట్ సమీపానికి రావడంతో పార్లమెంట్ భద్రతా బలగాలు ఒక్క సారిగా అలర్ట్ అయ్యాయి. విజయ్ చౌక్ నుంచి పార్లమెంట్‌కు ఉపరాష్ట్రపతి, ప్రధాని, హోం మంత్రి, ఇతర మంత్రులు, ఎంపీలు వెళ్లే మెయిన్ గేట్‌కు పార్లమెంట్ భద్రతా సిబ్బంది తాళం వేశారు. ఈ గేటును దాటుకొని వస్తే అడ్డుకునేలా ఫైర్ ఇంజన్ పైపులను పోలే వాటర్ పైపులను సిద్ధం చేసుకున్నారు. పరిస్థితులు చేయి దాటితే తుపాకి కాల్పులు చేసేలా సీఐఎస్ఎఫ్ సిబ్బంది పొజిషన్ తీసుకున్నారు. ప్రెస్ క్లబ్ దగ్గర ఉద్రిక్తత ఏర్పడటంతో ఆ సమీపంలోని కేంద్ర ప్రభుత్వ ఆఫీసులను మూసి వేశారు. ఎవరినీ లోనికి రాకుండా భద్రతను పెంచారు.

**'ఎంతైనా కొట్టండి' 'బొద్దింకల' గాండ్రింపు**

ఇండియా గేట్, పార్లమెంట్‌కు వెళ్లే రహదారులపై బారికేడ్లు ఏర్పాటు చేశారు. కానీ ప్రజలు వీటన్నింటినీ దాటుకుని ఢిల్లీకి తరలిరావడంతో కేంద్ర ప్రభుత్వ ప్రయత్నాలు వృథా అయ్యాయి. పార్లమెంట్ సమీప ప్రాంతం 'బొద్దింకల'తో నిండిపోయింది. 'పార్లమెంట్ మార్చ్' లో పాల్గొన్న నిరసనకారులపై పలు చోట్ల పోలీసులు కర్కశంగా వ్యవహరించారు. ఒక్కొక్కరినీ టార్గెట్ చేసుకొని, రౌండప్ చేసి లాఠీలతో చితకబాదారు. ఒక ఆందోళన కారుడిని ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్(చుట్టు ముట్టి) ఐదుగురు కలిసి చావ బాదారు. ఈ దెబ్బలను తట్టుకొని అలాగే నిలిచిపోయిన నిరసనకారుడు ఎంతైనా కొట్టండి అంటూ అరుస్తోన్న వీడియో వైరల్ అయింది. మరికొన్ని చోట్ల ఇలాంటి పరిస్థితే కనిపించింది. ఒక యువకుడికి చాఠీఛార్జ్‌లో కాలికి తీవ్రగాయమైంది. అయినప్పటికీ, నినాదాలు చేస్తూనే ఉండటం అక్కడివారిని కదిలించింది. అంతకు ముందు.. మద్దతుదారులు "శాంతంగా ఉండాలి" అని సీజేపీ కోరింది. 'కొన్ని చోట్ల మిమ్మల్ని అడ్డగించినప్పటికీ, ప్రశాంతంగా ఉండి శాంతిని కాపాడండి. మనం శాంతి, ప్రేమతో మాత్రమే దీన్ని గెలుస్తాం" అని పేర్కొంది. దీంతో విద్యార్థులు, యువత ఎక్కడా ఎటువంటి అవాంఛనీయ ఘటనలకు ఆస్కారం ఇవ్వలేదు. కేంద్ర ప్రభుత్వ ఆదేశాలతో పోలీసులే విద్యార్థులు, యువతపై అమానవీయంగా దాడికి దిగారు. నటులు ప్రకాష్ రాజ్, షబానా అజ్మీలపై కూడా భద్రతా దళాలు దాడి చేశాయి. గీతాంజలి ఆంగ్మోపై దారుణంగా దాడి జరిగింది. జంతర్ మంతర్ వద్ద నిరసన వేదికలను ధ్వంసం చేశారు.

**మెట్రో స్టేషన్లు మూసివేత**

సీజేపీ పార్లమెంట్ మార్చ్ నేపథ్యంలో ఢిల్లీ మెట్రో రైల్ కార్పొరేషన్ అధికారులు ముందు జాగ్రత్త చర్యలు తీసుకున్నారు. పార్లమెంట్ తో కనెక్ట్ అయ్యే జన్ పథ్, రాజీవ్ చౌక్, పటేల్ చౌక్, సెంట్రల్ సెక్రటేరియల్, సేవా తీర్థ్ మెట్రో స్టేషన్లను మూసివేసింది. అలాగే లోక్ కళ్యాణ్ మార్గ్ (ప్రధాని నివాసం సమీపంలోని) మెట్రో స్టేషన్ వద్ద భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ప్రధాని ఇంటి వైపు మార్గాల్లో రెండంచెల భారీ కేడ్లు ఏర్పాటు చేశారు. సెంట్రల్ ఢిల్లీలో ఇంటర్నెట్ సేవలు, మొబైల్ నెట్‌వర్క్‌లను నిలిపివేశారు.

**చర్చలకు వచ్చిన కేంద్ర మంత్రి జేపీ నడ్డా**

పరిస్థితులు ఉద్రిక్తంగా మారడంతో కేంద్ర ప్రభుత్వ ఆదేశాలతో కేంద్ర మంత్రి జేపీ నడ్డా సీజేపీ నేతలతో చర్చలకు వచ్చారు. సీజేపీ ప్రతినిధులు అశుతోష్ రంగ, సౌరవ్ దాస్ కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి జెపి నడ్డాతో భేటీ అయ్యారు. కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌తో తక్షణమే రాజీనామా చేయించి, పదవి నుంచి తొలగించాలని కోరుతూ, తమ డిమాండ్లతో కూడిన ఒక వినతిపత్రాన్ని వారు అందజేశారు. ఈ డిమాండ్లపై తగిన స్థాయిలో చర్చిస్తామని నడ్డా చెప్పారు. అయితే, చర్చల్లో ఎలాంటి హామీ లభించలేదని, తమ డిమాండ్లను అంగీకరించే వరకు శాంతియుత నిరసనలు ఆపబోమని సౌరవ్ దాస్ అన్నారు. మరోవైపు పార్లమెంట్ లోని తన ఛాంబర్ లో కేంద్ర హోంమంత్రి అమిత్ షాతో కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ సమావేశం అయ్యారు.

**ఖండించిన ప్రతిపక్షాలు**

కేంద్ర ప్రభుత్వ చర్యల కారణంగా సోమవారం ప్రారంభమైన పార్లమెంటులో గందరగోళం నెలకొంది. పోలీసుల క్రూరత్వాన్ని కాంగ్రెస్, సీపీఐ(ఎం) టీఎంసీ, డిఎంకె, ఆప్, ఎస్పి, ఎన్‌సిపితో పాటు దేశంలోని అన్ని ప్రతిపక్ష పార్టీలు ఖండించాయి.

**సీపీఐ(ఎం) సహా పలువురి మద్దతు**

పర్యావరణ కార్యకర్త సోనమ్ వాంగ్‌చుక్ దీక్షను కొనసాగిస్తున్నట్టు ప్రకటించారు. అదే సమయంలో సీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే, ఎస్ఎఫ్ఐ నేతలు ఆదర్శ ఎం.సాజీ, ఐషీ ఘోష్, ఏఐఎస్ఎఫ్ నాయకులు నేహా, మనీష్, అమీన్ లు తమ నిరాహార దీక్షల్ని విరమించారు. వీరితో సీపీఐ(ఎం) ఎంపీ అమ్రారామ్, బాలీవుడ్ సీనియర్ నటి షబానా అజ్మీ, నటుడు ప్రకాశ్ రాజ్, ఆర్జేడీ ఎంపీ మనోజ్ కుమార్ ఝా, ఆర్జేడీ నేత రాజా రామ్ పాల్, సామాజిక కార్యకర్త యోగేంద్ర యాదవ్, నీట్ ప్రశ్నపత్రం లీక్ నేపథ్యంలో ఉత్తరాఖండ్‌లో ఆత్మహత్య చేసుకున్న రియా థాపా తండ్రి, మాజీ సైనికుడు రాజేష్ థాపాలు నిమ్మ రసాలు ఇచ్చి వారితో దీక్షలు విరమింపజేశారు.

# దద్దరిల్లిన పార్లమెంట్

(మొదటి పేజీ తరువాయి)

అయినా నిరసనలు కొనసాగుతుండటంతో ఆయన సభ ప్రారంభమైన 13 నిమిషాల్లోనే వాయిదా వేశారు. తిరిగి ప్రారంభమైన సభలో గందరగోళం మధ్యే న్యాయశాఖ మంత్రి అర్జున్ మేఘ్వాల్ సుప్రీంకోర్టు (న్యాయమూర్తుల సంఖ్య) సవరణ బిల్లును ప్రవేశపెట్టారు. అయినప్పటికీ సభలో ప్రతిపక్షాల ఆందోళన కొనసాగింది. దీంతో సభ ప్రారంభమైన ఆరు నిమిషాల్లోనే (మధ్యాహ్నం 12.30 గంటలకు) ప్యానెల్ స్పీకర్ దిలీప్ సైకియా సభను వాయిదా వేశారు. ఆ తర్వాత ప్రారంభమైన సభలో ప్రతిపక్షాల ఆందోళన కొనసాగడంతో ఐదు నిమిషాల్లోనే మళ్లీ మధ్యాహ్నం 1 గంటకు సభ వాయిదా పడింది. అనంతరం ప్రారంభమైన సభలోనూ అదే పరిస్థితి కొనసాగడంతో ప్యానెల్ స్పీకర్ దిలీప్ సైకియా రెండు నిమిషాల్లోనే మధ్యాహ్నం 2.00 గంటలకు సభను వాయిదా వేశారు. మరలా సభ ప్రారంభమైనా ప్రతిపక్షాల ఆందోళన అదే విధంగా కొనసాగింది. దీంతో ప్యానెల్ స్పీకర్ జగదాంబికా పాల్ మూడు నిమిషాల్లోనే మధ్యాహ్నం 2. 30 గంటలకు సభను వాయిదా వేశారు. తిరిగి సభ ప్రారంభం కాగా మూడు నిమిషాల్లోనే మధ్యాహ్నం 3 గంటల వరకు సభను వాయిదా వేశారు. ఆ తర్వాత ప్రారంభమైన సభలో కూడా అదే పరిస్థితి నెలకొనడంతో ప్యానెల్ స్పీకర్ జగదాంబిక పాల్ సభను రెండు నిమిషాల్లోనే నేటి (మంగళవారం)కి వాయిదా వేశారు.


రాజ్యసభలో కూడా అదే తంతు కొనసాగింది. రాజ్యసభను చైర్మెన్ సీపీ రాధాకృష్ణన్ ప్రారంభించారు. ఇటీవల కొత్తగా ఎన్నికైన తొమ్మిది మంది సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం ప్రతిపక్ష సభ్యులు నీట్ ప్రశ్నాపత్రం లీక్, అయోధ్య రామ మందిరంలో విరాళాల దొంగతనం అంశాలను లేవ నెత్తారు. ఆయా అంశాలపై చర్చించాలని పట్టుపట్టారు. చైర్మెన్ వారించినప్పటికీ, ప్రతిపక్ష సభ్యులు చర్చించాల్సిందేనని పట్టుబట్టారు. ఈ సందర్భంగా ప్రతిపక్ష నేత మల్లికార్జున ఖర్గే మాట్లాడుతూ జంతర్ మంతర్ వద్ద విద్యార్థులపై పోలీసులు జరిపిన లాఠీచార్జిని ఆయన ఖండించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ జవాబుదారీతనం వహించాలని డిమాండ్ చేశారు. " నేను లక్షలాది విద్యార్థుల భవిష్యత్తు గురించి మాట్లాడుతున్నాను. దానికోసమే వేలాది మంది విద్యార్థులు జంతర్ మంతర్ వద్దకు వచ్చారు. ఈ క్రమంలో పోలీసులు వారిపై లాఠీచార్జి చేశారు. ప్రభుత్వం వారి ఆందోళనను అణచివేయాలని ప్రయత్నిస్తోంది" అని నినాదాల మధ్యే ఖర్గే అన్నారు. దీంతో చైర్మెన్ రాధాకృష్ణన్ సభను మధ్యాహ్నం 12 గంటలకు వాయిదా వేశారు. తిరిగి ప్రారంభమైన సభలోనూ ప్రతిపక్షాల ఆందోళన కొనసాగింది. దీంతో సభను ఒక్క నిమిషంలోనే మధ్యాహ్నం 12.30 గంటలకు వాయిదా వేశారు. తిరిగి ప్రారంభమైన సభలో ప్రతిపక్షాల ఆందోళన అలాగే కొనసాగడంతో మళ్లీ ఒక్క నిమిషంలోనే మధ్యాహ్నం 12. 50 గంటలకు సభ వాయిదా పడింది. అనంతరం ప్రారంభమైన సభలో అదే సీన్ కొనసాగింది. దీంతో సభను 50 సెకెన్లలోనే మధ్యాహ్నం 2 గంటలకు వాయిదా వేశారు. మరలా తిరిగి ప్రారంభమైన సభలో ప్రతిపక్షాల ఆందోళన కొనసాగడంతో డిప్యూటీ చైర్మెన్ హరివంశ్ నారాయణ్ సింగ్ సభను రెండు నిమిషాల్లోనే మధ్యాహ్నం 2.30 గంటలకు వాయిదా వేశారు. ఆ తర్వాత సభ ప్రారంభమైనా అందే తంతు కొనసాగడంతో డిప్యూటీ చైర్మెన్ హరివంశ్ నారాయణ్ సింగ్ ఒకే నిమిషంలో సభను నేటి (మంగళవారం)కి వాయిదా వేశారు.

**ప్రతిపక్షాల భేటీ**

సమావేశానికి ముందే ప్రతిపక్షాలన్నీ సమావేశమయ్యాయి. ప్రభుత్వం నుంచి జవాబుదారీతనం కోరేందుకు ఇండియా బ్లాక్ నేతలు నిర్ణయించారు. రామ మందిర విరాళాల అక్రమాలు, విద్యా వ్యవస్థ 'కుప్పకూలడం' వంటి పలు అంశాలపై ప్రభుత్వం నుంచి జవాబుదారీతనం కోరాలని నిర్ణయించారు. ఈ సమావేశానికి ముందు ప్రతిపక్ష నాయకులు , రాజ్యసభ ప్రతిపక్ష నాయకుడు మల్లికార్జున ఖర్గే ఛాంబర్‌లో సమావేశమయ్యారు. "2015 నుంచి 152 సార్లు ప్రశ్నాపత్రాలు లీక్ అయ్యాయి, 25 మంది విద్యార్థులు ఆత్మహత్య చేసుకున్నారు. ధర్మేంద్ర ప్రధాన్‌ను తప్పక తొలగించాలి" అని ఖర్గే అన్నారు. ఈ సమావేశానికి రాహుల్ గాంధీ, గౌరవ్ గొగోయ్, జైరాం రమేష్, సుప్రియా సూలే, సాగరికా ఘోష్, సంజయ్ రౌత్, జాన్ బ్రిట్టాస్‌తో పాటు ఇండియా బ్లాక్ పార్టీల నాయకులు హాజరయ్యారు.

## సంపాదకీయం

# భార్యల చేతిలో భర్తల 'బలి'



దేశంలో భర్తల భద్రతపై ఆందోళన పెంచుతున్న 'ఏకం న్యాయ్ ఫౌండేషన్' నివేదిక సంచలనం రేపుతోంది. 2026 జనవరి నుండి జులై 14 వరకు ఆరు నెలల కాలంలో ఏకంగా 554 మంది భర్తలు హత్యలు లేదా ఆత్మహత్యల కారణంగా ప్రాణాలు కోల్పోయినట్లు ఈ నివేదిక వెల్లడించింది. ఇందులో 322 మంది భార్యలు లేదా వారి ప్రియుల చేతిలో దారుణంగా హత్యకు గురయ్యారు. మిగిలిన 232 మంది వైవాహిక విభేదాలు, గృహహింస, మానసిక వేధింపుల కారణంగా ఆత్మహత్య చేసుకున్నారు. ప్రతిరోజూ సగటున ఇద్దరు భర్తలు హత్యకు గురవుతుండగా, ఒకరి కంటే ఎక్కువ మంది ఆత్మహత్యకు పాల్పడుతున్నట్లు గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. ఈ మరణాల వెనుక వివాహేతర సంబంధాలు, కుటుంబ కలహాలు ప్రధాన కారణాలుగా నిలుస్తున్నాయి. కుటుంబ వ్యవస్థలో పెరుగుతున్న అశాంతి పురుషుల జీవితాలను తీవ్ర ప్రమాదంలోకి నెట్టేస్తోంది. ఈ గణాంకాలు సమాజంలో నెలకొన్న విషాదకర పరిస్థితులకు అద్దం పడుతున్నాయి. భర్తలపై జరుగుతున్న హత్యలు, ఆత్మహత్యలపై గురుగ్రామ్‌కు చెందిన ఏకం న్యాయ్ ఫౌండేషన్ విడుదల చేసిన తాజా నివేదిక తీవ్ర చర్చనీయాంశంగా మారింది. 2026 తొలి ఆరు నెలల్లో దేశవ్యాప్తంగా 554 మంది భర్తలు హత్యలు, ఆత్మహత్యలు చోటు చేసుకున్నట్లు ఏకం న్యాయ్ ఫౌండేషన్ సంస్థ వెల్లడించింది. అయితే ఇవి ప్రభుత్వ అధికారిక గణాంకాలు కాదని.. విడియా కథనాలు, ఫౌండేషన్ సేకరించిన వివరాల ఆధారంగా రూపొందించిన డాక్యుమెంటేషన్ రిపోర్టు మాత్రమేనని స్పష్టం చేసింది. ఈ నివేదిక ప్రకారం.. మొత్తం 322 మంది భర్తలు హత్యకు గురయ్యారని తెలుస్తోంది. వీరిలో అత్యధిక కేసులు భార్యలు లేదా వారి వివాహేతర సంబంధాల నేపథ్యంలో జరిగిన కుట్రలతో ముడిపడి ఉన్నట్లు ఆ సంస్థ పేర్కొంది. మొత్తం హత్యల్లో 194 కేసులు (సుమారు 60.2 శాతం) వివాహేతర సంబంధాల కారణంగానే జరిగినట్లు ఆ రిపోర్టు వెల్లడించింది. భార్యలు, తమ ప్రియులతో కలిసి కట్టుకున్న భర్తలను హత్య చేసిన ఘటనలు ఎక్కువగా నమోదు అయ్యాయని ఆ నివేదిక తెలిపింది. అదే సమయంలో 232 మంది భర్తలు ఆత్మహత్యలకు పాల్పడినట్లు ఏకం న్యాయ్ ఫౌండేషన్ పేర్కొంది. వీటిలో కుటుంబ కలహాలు, గృహహింస, మానసిక వేధింపులు, తప్పుడు క్రిమినల్ కేసులు, పిల్లలను కలవనివ్వకపోవడం వంటి కారణాలు ప్రధానంగా ఉన్నాయని నివేదికలో వివరించింది. ఈ కేసుల్లో విషం పెట్టి చంపడం, గొంతు నులిమి హత్య చేయడం, విద్యుత్ షాక్ పెట్టి హతమార్చడం, సజీవదహనం చేయడం, మృతదేహాలను ముక్కలు ముక్కలుగా నరకడం, చంపేసి ప్రమాదంగా లేదా ఆత్మహత్యగా చిత్రీకరించడం వంటి అత్యంత దారుణమైన నేరాలు నమోదు అయినట్లు ఆ నివేదిక తెలిపింది. రాష్ట్రాల వారీగా చూస్తే అత్యధికంగా 93 హత్యలు, 103 ఆత్మహత్యలతో ఉత్తరప్రదేశ్ అగ్రస్థానంలో నిలిచినట్లు ఏకం న్యాయ్ ఫౌండేషన్ రిపోర్టు తెలిపింది. ఆ తర్వాత మధ్యప్రదేశ్, రాజస్థాన్, తెలంగాణ, మహారాష్ట్ర, హర్యానా, బీహార్, కర్ణాటక, గుజరాత్ రాష్ట్రాల్లో కూడా ఇలాంటి కేసులు ఎక్కువగా నమోదు అయ్యాయని పేర్కొంది. అయితే.. ఈ నివేదికపై ప్రభుత్వ అధికారిక ధృవీకరణ లేదని ఆ సంస్థ స్పష్టం చేసింది. దేశంలో భర్తల హత్యలు లేదా పురుషులపై గృహహింసకు సంబంధించిన ప్రత్యేక జాతీయ డేటాబేస్ లేకపోవడంతో అసలు సంఖ్య మరింత ఎక్కువగా ఉండే అవకాశం ఉందని ఏకం న్యాయ్ ఫౌండేషన్ అభిప్రాయం వ్యక్తం చేసింది. ఇటీవల ఉత్తరప్రదేశ్‌లోని విరట్ జిల్లాలో జరిగిన ఘటన అందరినీగ్భ్రాంతికి గురిచేసింది. అతుల్ పవార్ అనే వ్యక్తిని తన భార్య దామిని, ప్రియుడు తుషార్‌తో కలిసి విషసర్పంతో కాటేయించి చంపేసింది. భర్త పేరుపై ఉన్న 20 లక్షల రూపాయల బీమా సొమ్మును కాజేయాలని, ప్రియుడితో కలిసి జీవించాలని ఆమె పన్నిన పన్నాగం ఇది. నిందితులు పామును కొనుగోలు చేసి, నిద్రమాత్రలు కలిపిన పాలు తాగించి ఈ దారుణానికి ఒడిగట్టారు. పోలీసులు సాంకేతిక ఆధారాలు, కాల్ డేటాను విశ్లేషించి నిందితులను అరెస్టు చేశారు. 20 రోజుల క్రితమే కారుతో ఢీకొట్టి చంపేందుకు ప్రయత్నించినట్లు విచారణలో తేలింది. ఈ కేసు భార్యాభర్తల మధ్య పెరిగిపోయిన ద్వేషాన్ని, డబ్బు కోసం ఎంతటి దారుణానికైనా తెగించే కఠిన మనస్తత్వాలను కళ్లకు కట్టినట్లు చూపిస్తోంది. ఇలాంటి ఘటనలు కుటుంబ సంబంధాల పునాదులను పూర్తిగా దెబ్బతీస్తున్నాయి. వైవాహిక జీవితంలో నెలకొంటున్న ఇటువంటి తీవ్రమైన సమస్యలను పరిష్కరించేందుకు కౌన్సెలింగ్, చట్టపరమైన అవగాహన కార్యక్రమాలు అత్యవసరమని నిపుణులు సూచిస్తున్నారు. కేవలం చట్టం మాత్రమే కాకుండా, సామాజిక బాధ్యతతో కుటుంబ వ్యవస్థను కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. మానసిక ఒత్తిడి, అపార్థాలను తొలగించుకోవడానికి సంభాషణలు మాత్రమే సరైన మార్గం. పురుషులు కూడా తమ సమస్యలను పంచుకునే వేదికలు, మానసిక ఆరోగ్య సేవలు అందుబాటులోకి రావాలి. ఈ గణాంకాలు ప్రభుత్వాలు, సమాజం కలిసి పని చేయాల్సిన సమయం ఆసన్నమైందని హెచ్చరిస్తున్నాయి. భర్తల ప్రాణాలను కాపాడడం, కుటుంబాలను విచ్ఛిన్నం కాకుండా చూడడం అందరి బాధ్యత. రాబోయే రోజుల్లో అయినా ఇటువంటి దుర్మార్గమైన ఘటనలు తగ్గుతాయని, ఆరోగ్యకరమైన కుటుంబ సంబంధాలు నెలకొంటాయని ఆశిద్దాం. సామాజిక చైతన్యం ద్వారా మాత్రమే ఇటువంటి దారుణాలకు ముగింపు పలకడం సాధ్యమవుతుంది. ఈ సమస్య తీవ్రతను అంచనా వేయాలంటే అధికారిక గణాంకాల సేకరణ అవసరమని ఏకం న్యాయ్ ఫౌండేషన్ సంస్థ సూచించింది.

# ప్రసంగాలతో ఇచ్చిపడేస్తున్న రేవంత్..

**హైదరాబాద్ - సూర్య వాస్తవం**



తెలంగాణా రాజకీయాల్లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తనదైన శైలిలో ప్రత్యర్థులను ఉక్కిరిబిక్కిరి చేస్తూ దూసుకుపోతున్నారు. ఆయన మాటలు పదునైన ఆయుధాల్లా ప్రత్యర్థుల గుండెల్లోకి దిగిపోతుంటాయి. ఎదుటి వారు తనపై ఎన్ని విమర్శలు సంధించినా, తనదైన వాక్చాతుర్యంతో వాటిని తిప్పికొట్టడంలో ఆయన దిట్ట. రేవంత్ రెడ్డికి ఉన్న అతిపెద్ద సానుకూలత ఆయన ప్రసంగ శైలి. ఎంతటి క్లిష్టమైన అంశాన్నైనా సామాన్యులకు అర్థమయ్యే రీతిలో, ఆకట్టుకునేలా చెప్పడం ఆయన ప్రత్యేకత. తెలంగాణా యాస, మాండలీకాలు, సందర్భోచిత సామెతలను జోడించి ప్రసంగించడంతో జనం ఆయన మాటలకు బాగా కనెక్ట్ అవుతున్నారు. ప్రత్యర్థులపై విమర్శలు చేసేటప్పుడు ఆయన చూపే చొరవ, వ్యూహాత్మకమైన దూకుడు రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. ఏ విషయంపైనైనా విపక్షాల నుంచి ఎదురయ్యే ప్రశ్నలకు ఆయన ఇచ్చే సమాధానాలు వినడానికి ఆసక్తికరంగా ఉండి, జనంలోకి బలంగా దూసుకెళ్తున్నాయి. రాజకీయ మైదానంలో తనను ఎదుర్కొనే ధీటైన వక్త ఎవరూ లేకపోవడం రేవంత్ రెడ్డికి పెద్ద అడ్వాంటేజ్. తనను విమర్శించే వారి ఫ్లాష్‌బ్యాక్‌ను బయటకు తీసి, జరిగిన పాత విషయాలను ఆధారాలతో సహా ప్రజల ముందు ఉంచడం ఆయన అలవాటు. దీనివల్ల ప్రత్యర్థులు డిఫెన్సివ్‌లో పడుతున్నారు. గతంలో జరిగిన నియామకాలు, అధికార దుర్వినియోగం వంటి అంశాలను ఆయన తనదైన శైలిలో గుర్తు చేస్తున్నారు. ఎవరైనా తనపై విమర్శలు చేస్తే, దానికి అంతకు పదింతలు ఘాటైన కౌంటర్ ఇవ్వడం రేవంత్ స్టైల్. తన ప్రసంగాల ద్వారా ప్రత్యర్థుల బలహీనతలను ఎత్తిచూపుతూ, వారిని అపహాస్యం చేయడం ఆయన వ్యూహం. ఈ మాటలయుద్ధంలో రేవంత్ రెడ్డిని ఓడించడం బీఆర్ఎస్ నేతలకు సవాలుగా మారింది. ఏ విమర్శకైనా ఆయన రెడీగానే ఉండటం, కౌంటర్ అటాక్‌లో ఆయన చూపే వేగం రాజకీయాల్లో ఆయనను అగ్రస్థానంలో నిలబెడుతోందిఇటీవల నిరుద్యోగ సమస్యపై బీఆర్ఎస్ చేసిన ఆందోళనలను రేవంత్ రెడ్డి తన మాటలతో తిప్పికొట్టారు. ముఖ్యంగా కేటీఆర్ విమర్శలకు ఆయన ఇచ్చిన జవాబు స్ట్రాంగ్ డోస్‌గా మారింది. కేసీఆర్ ప్రభుత్వంలో జరిగిన ఉద్యోగాల కేటాయింపులను ఆయన పక్కా డేటాతో బయట పెట్టారు. కేటీఆర్, హరీష్ రావు, కవిత, వినోద్ కుమార్ వంటి కుటుంబ సభ్యులకే కేసీఆర్ ఉద్యోగాలు ఇచ్చారని ఆయన ఎద్దేవా చేశారు. ఎన్నికల్లో ఓడిపోయిన వారికి సైతం పదవులు కట్టబెట్టి, నియామక పత్రాలు ఇవ్వడం కేసీఆర్ కే చెల్లిందని ఆయన విమర్శించారు. పదేళ్ల కాలంలో నాలుగు కోట్ల తెలంగాణా ప్రజలు కేసీఆర్ కుటుంబానికి ఉద్యోగాలు ఇస్తే, వారు సమాజానికి ఏమిచ్చారని రేవంత్ రెడ్డి సూటిగా ప్రశ్నించారు. ఈ వాదన జనాల్లోకి బాగా వెళ్లడంతో, బీఆర్ఎస్ వాదనలు నీరుగారిపోయాయి. ఆయన ప్రయోగించే ఈ రకమైన రాజకీయ అస్త్రాలు ప్రత్యర్థులను పూర్తిగా ఇరకాటంలోకి నెడుతున్నాయి. రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నంత వరకు బీఆర్ఎస్ పార్టీకి రాజకీయంగా కష్టమేనన్న భావన బలపడుతోంది. మాట్లాడితే చాలు, గత ప్రభుత్వ అక్రమాలను, తప్పులను ఆయన ప్రస్తావిస్తూ ప్రత్యర్థుల నోరు మూయిస్తున్నారు. ఆయన చేసే ప్రసంగాల్లో ఉండే స్పష్టత, వాస్తవికత ప్రజలను ప్రభావితం చేస్తున్నాయి. రేవంత్ రెడ్డి ఏమి చెప్పినా, ఏ విమర్శ చేసినా అది బలంగా ప్రజలకు అర్థమవుతోంది. కేసీఆర్ కుటుంబానికి మళ్ళీ అధికారం దక్కనిచ్చే ప్రసక్తే లేదని ఆయన చేస్తున్న భీషణ ప్రతిజ్ఞలు గులాబీ పార్టీకి నిద్రలేని రాత్రులను మిగులుస్తున్నాయి. మాటకారి వ్యూహకర్త అయిన రేవంత్ రెడ్డితో పెట్టుకోవడం అంటే ప్రమాదకరమని ఆ పార్టీ నేతలు గుర్తిస్తున్నారు. ఆయనతో గొడవ పెట్టుకుంటే ఒకటి అని నాలుగు మాటలు వినక తప్పదన్న అభిప్రాయం వ్యక్తం అవుతోంది. రాజకీయ వ్యూహాల్లో రేవంత్ రెడ్డి వేస్తున్న ప్రతి అడుగు బీఆర్ఎస్ పార్టీ పునాదులను కదిలిస్తోంది. రేవంత్ రెడ్డి రాజకీయ శైలిని గమనిస్తే, ఆయన ఎంతటి తీవ్రమైన విమర్శలనైనా సులువుగా స్వీకరిస్తారని అర్థమవుతుంది. ఆ విమర్శల నుండి పాఠాలు నేర్చుకుంటూనే, తిరుగుదాడి చేయడంలో ఆయన చూపే వేగం ప్రత్యర్థులను ఆశ్చర్యపరుస్తోంది. ఒక ముఖ్యమంత్రిగా తన బాధ్యతలను నెరవేరుస్తూనే, మరోవైపు రాజకీయ ప్రత్యర్థులకు సరైన సమాధానం ఇవ్వడంలో ఆయన రాజీ పడటం లేదు. జనాల్లోకి వెళ్ళడానికి ఆయన ఎంచుకున్న మార్గం, మాట్లాడే పద్ధతి ఈ తరం ఓటర్లకు చాలా బాగా అర్థమవు తోంది. సోషల్ మీడియాలో కూడా ఆయన మాటలు ట్రెండింగ్‌లో ఉంటాయి. ఇలా రేవంత్ రెడ్డి ఒకవైపు అభివృద్ధి పనులు చేస్తూనే, ఇంకోవైపు రాజకీయ ప్రత్యర్థులపై తన మాటల వేటను కొనసాగిస్తున్నారు. రేవంత్ రెడ్డిని రాజకీయంగా ఎదుర్కోవడం, ఆయన వేసే ప్రశ్నలకు సమాధానం చెప్పడం అనేది విపక్షాలకు రాబోయే రోజుల్లో మరింత కష్టతరంగా మారే అవకాశం పుష్కలంగా ఉంది.

# పొత్తులకు వైసీపీ ప్రయత్నాలు

**విజయవాడ - సూర్య వాస్తవం**



జగన్ వచ్చే ఎన్నికల్లో పొత్తుకు సిద్ధమవుతున్నారా? అంటే రాజకీయాల్లో ఏదైనా జరగొచ్చు. ఎప్పుడూ దేనినీ తోసిపుచ్చలేం. ప్రచారమని ఇప్పుడు అను కున్నా.. బలమైన ప్రత్యర్థిని మట్టికరిపించాలంటే తన బలగాన్ని కూడా పెంచుకోవాల్సి ఉంటుంది. అదే యుద్ధనీతి. రీతి కూడా. ఆంధ్రప్రదేశ్ ఎన్నికలకు ఇంకా మూడేళ్ల సమయం ఉంది. అయితే కూటమి పాలనపై వామపక్ష పార్టీలు విమర్శలు చేస్తున్నాయి. చంద్రబాబు పాలనపై విరుచుకుపడుతున్నాయి. అలాగే ప్రతి సమస్యపై పోరాడుతున్నాయి. మరొకవైపు కూటమిలో జరుగుతున్న ప్రతి ఘటనను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ఎర్రదండు కార్యక్రమాలను రూపొందించుకుంది. కూటమిలో బీజేపీ ఉండటంతో సహజంగానే వామపక్షాలు జగన్‌కు చేరువవుతాయంటున్నారు. అలాగని జగన్ కూడా బీజేపీకి దూరం కాదు. కానీ ప్రత్యక్షంగా పొత్తు లేదు కాబట్టి వైసీపీతో కలసి నడవటానికి ఎర్రన్నలు సిద్ధమవుతున్నట్లు సమాచారం. సీపీఐ నేత రామకృష్ణ ఇటీవల కాలంలో పదే పదే విమర్శలు చేయడం, సీపీఐ కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య సయితం ప్రతి అంశంపై ప్రభుత్వానికి వ్యతిరేకంగా స్పందించడం ఇందుకు ఉదాహరణగా చూపుతున్నారు. అలాగేఇక సీపీఎం తొలి నుంచి కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగానే గళం విప్పుతూనే ఉంది. ఈ రెండు పార్టీలతో కలసి జగన్ వెళతారన్న ప్రచారం జరుగుతుంది. ఇప్పటి వరకూ జగన్ ఒంటరిగానే పోటీ చేస్తూ వచ్చారు. వామపక్షాలు మాత్రం ఒకసారి పవన్ తో కలసి పోటీ చేసి ఒక్క స్థానాన్ని కూడా దక్కించుకోలేదు. ఆ మాట కొస్తే రాష్ట్ర విభజన జరిగిన తర్వాత ఏర్పడిన ఆంధ్ర ప్రదేశ్ శాసనసభలో వామపక్షాలకు ఇప్పటి వరకూ ప్రాతినిధ్యం లేదు. అయితే జగన్‌కు తన బలం, బలగంపై అపార నమ్మకం ఉంది. ఒంటరిగానే పోటీ చేయాలన్న తపన ఉంది. కానీ కూటమిని ఎదుర్కొనాలంటే ఓటు బ్యాంకు లేకపోయినా గట్టి వాయిస్ ఉన్న వామపక్ష పార్టీలు తోడుగా నిలిస్తే కొంత రాజకీయంగా ఉపయోగం ఉంటుందని జగన్ భావిస్తున్నట్లు తెలిసింది. అయితే దీనిపై ఇంకా క్లారిటీ లేకపోయినా వామపక్షాలతో జగన్ పొత్తు పెట్టుకునే అవకాశాలు మాత్రం కొట్టిపారేయలేం. వైసీపీ గత ఎన్నికల్లో చిత్తుగా ఓడిపోయింది. 151 స్థానాల నుంచి 11కు పడిపోయింది. దీనికి కారణాలు ఏంటన్నవి అందరికీ తెలిసినా.. వైసీపీకి మాత్రం ఇంకా బోధపడలేదు. దీంతో ఇటు పార్టీలోను, అటు నాయకుల్లోనూ మార్పు కనిపించడం లేదన్న వాదన ఉంది. వాస్తవానికి ప్రజాస్వామ్యంలో గెలుపు ఓటములు కామనే అయినా.. కారణాలు తెలుసుకుని ముందుకు సాగాల్సిన అవసరం పార్టీలపై ఉంటుంది. వాటిని సరిదిద్దుకునే ప్రయత్నం చేయాలి. ప్రస్తుత ప్రభుత్వంపై ఉన్న వ్యతిరేకత లేదా పుట్టబోయే వ్యతిరేకత తమకు మేలు చేస్తుందని వైసీపీ నాయకులు అంచనా వేసుకుంటున్నారు. వాస్తవానికి ఇది పార్టీ అధిష్టానంలోనే ఉంది. అందుకే క్షేత్రస్థాయి నాయకులు కూడా అదే దారిలో నడుస్తున్నారు. దీంతో వైసీపీలో సరైన దిశానిర్దేశం లేకుండానే నాయకులు ముందుకు సాగుతున్న పరిస్థితి కనిపిస్తోంది. ఫలితంగా పార్టీ పుంజుకునే విషయంలో ఇంకా వెనుక బడే ఉందన్నది వాస్తవం. ముఖ్యంగా నియోజకవర్గాల స్థాయిలో పార్టీకి భారీ ఎదురు దెబ్బలు తగులుతున్నాయి. మాజీ ఎమ్మెల్యే వైఖరి పార్టీకి కలిసి రాకపోగా.. వివాదాలకు కేంద్రంగా మారుతోంది. దీనిని సరిచేయాల్సి పార్టీ అధిష్టానం కూడా మౌనంగానే ఉండడం గమనార్హం. అంతా నేతలే చూసుకుంటారులే అనే ధోరణి అవలంభించడంతో పరిస్థితి ఇబ్బంది గానే ఉందన్నది పార్టీకి తెలిసినా.. నాయకులకు ఎలాంటి దిశానిర్దేశం చేయడం లేదు.

ప్రస్తుతం ఉత్తరాంధ్రలో కేవలం నలుగురైదుగురు నాయకులు మాత్రమే యాక్టివ్‌గా ఉన్నారు. సీమలో కూడా కేవలం ఇద్దరు ముగ్గురు నేతలు మాత్రమే వాయిస్ వినిపిస్తున్నారు. ఇక, ఉభయ గోదావరి, ఉమ్మడి కృష్ణాలో ఒకరిద్దరు కూడా తక్కువగానే ఉన్నారు. గుంటూరులో అయితే.. అంబటి రాంబాబు కేంద్రంగానే వైసీపీ రాజకీయాలు సాగుతున్నాయి. ఇలా.. చేయడం వల్ల పార్టీపరంగా వచ్చే ఇమేజ్ మాట ఎలా ఉన్నా.. పోతున్న ఇమేజే ఎక్కువగా ఉంది. దీంతో రాజకీయం గా వైసీపీ పుంజుకోవడం కూడా కష్టమేనన్న భావన వ్యక్తమవుతోంది. మొత్తంగా ఈ రెండేళ్లలో పార్టీ పెద్దగా పుంజుకున్నది అయితే లేదని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

## ప్రభుత్వ నిధుల దుర్వినియోగం కేసులో

# ఇద్దరికి మూడేళ్ల జైలు శిక్ష

**- రూ.30 వేల జరిమానా విధించిన అనంతపురం మొబైల్ కోర్టు**
**- బుక్కరాయసముద్రం లాల్‌బహదూర్ పాఠశాల కేసులో తీర్పు**

**అనంతపురం :** లాల్‌బహదూర్ ఇంగ్లీష్ మీడియం ఎయిడెడ్ పాఠశాలలో ప్రభుత్వ నిధులు దుర్వినియోగానికి పాల్పడిన కేసులో ఇద్దరు ముద్దాయిలకు మూడేళ్ల జైలు శిక్ష, రూ.30 వేల జరిమానా విధిస్తూ అనంతపురం స్పెషల్ జె.ఎఫ్.సి.ఎమ్ మొబైల్ కోర్టు న్యాయమూర్తి తీర్పు వెలువరించారు.
పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి...

బుక్కరాయసముద్రంలోని లాల్‌బహదూర్ ఇంగ్లీష్ మీడియం ఎయిడెడ్ పాఠశాలలో సుమారు రూ.21 లక్షల ప్రభుత్వ నిధులు దుర్వినియోగం అయ్యాయంటూ 2011లో అప్పటి జిల్లా విద్యాధికారి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు అప్పటి బుక్కరాయసముద్రం ఎస్ఐ నారాయణరెడ్డి కేసు నమోదు చేసి, లోతుగా దర్యాప్తు జరిపి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు.

**నేరం రుజువు కావడంతో**

అనంతపురంలోని స్పెషల్ జె.ఎఫ్.సి.ఎమ్ మొబైల్ కోర్టులో ఈ కేసు విచారణ కొనసాగింది. విచారణలో ముద్దాయిలపై మోపబడిన నేరాలు నిరూపితం కావడంతో న్యాయమూర్తి తుది తీర్పును ప్రకటించారు. ఇద్దరు ముద్దాయిలకు ఒక్కొక్కరికి మూడేళ్ల సాధారణ జైలు శిక్షతో పాటు, రూ.30,000 చొప్పున జరిమానా విధిస్తూ ఆదేశాలు జారీ చేశారు.

**పోలీస్, ప్రాసిక్యూషన్ బృందానికి అభినందనలు**

ఈ కేసులో ముద్దాయిలకు శిక్ష పడేలా చేయడంలో అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ (ఇన్‌చార్జ్) శ్రీ శ్రీనివాసులు, కోర్టు కానిస్టేబుల్ రమణతో పాటు ప్రస్తుత బుక్కరాయసముద్రం సీఐ సుబ్బరాయుడు సమర్థవంతంగా కృషి చేశారు. కోర్టు విచారణలో కీలక సాక్ష్యాధారాలను పక్కాగా ప్రవేశపెట్టి, ప్రాసిక్యూషన్ విజయవంతం కావడంలో కీలక పాత్ర పోషించిన అధికారులు, సిబ్బందిని జిల్లా పోలీస్ ఉన్నతాధికారులు ప్రత్యేకంగా అభినందించారు.





## ఎల్-నినో పరిస్థితులపై మంత్రి పయ్యావుల కేశవ్ సమీక్ష

**- ముందస్తు కార్యాచరణ వేగవంతం చేయాలని ఆదేశం**



**అనంతపురం సిటీ - సూర్య వాస్తవం :** రాష్ట్రంలో నెలకొన్న ఎల్-నినో పరిస్థితుల నేపథ్యంలో రాష్ట్ర ఆర్థిక, ప్రణాళిక, వాణిజ్య పన్నులు మరియు శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ సోమవారం అనంతపురం నగరంలోని ఆర్ అండ్ బి అతిథి గృహంలో జిల్లా అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ ఓ. ఆనంద్, అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్ వ్యవసాయ, ఉద్యానవన, హెచ్ఎన్ఎస్ఎస్, హెచ్ఎల్సీ, మైనర్ ఇరిగేషన్, కేవీకే శాస్త్రవేత్తలు, ఆర్డబ్ల్యూ ఎస్, డీపీఓతో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. ఎల్-నినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు చేపట్టాల్సిన ముందస్తు చర్యలు, తాగునీటి సరఫరా, సాగునీటి నిర్వహణ, పంటల ప్రణాళిక, రైతులకు సాంకేతిక సూచనలు అందించడం, వివిధ శాఖల సమన్వయంపై మంత్రి అధికారులతో సమగ్రంగా సమీక్షించారు. అవసరమైన కార్యాచరణను వేగవంతంగా అమలు చేసి ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు.

## పోరుబాటలో మాజీ ఎంపీ తలారి రంగయ్యతో అంకంపల్లి వైసీపీ నాయకులు



**బెళుగుప్ప - సూర్య వాస్తవం :** హంద్రీనీవా ప్రాజెక్టు పరిరక్షణ కోసం నిర్వహించిన పోరుబాట కార్యక్రమంలో పాల్గొనేందుకు వచ్చిన మాజీ పార్లమెంట్ సభ్యులు తలారి రంగయ్యను అంకంపల్లి వైఎస్సార్సీపీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నాయకులు రుద్రానంద యాదవ్, శ్రీనివాసులరెడ్డి, బోయ నాగరాజు, అశోక్ యాదవ్ తదితరులు మాజీ ఎంపీ తలారి రంగయ్యను కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. హంద్రీనీవా ప్రాజెక్టు పూర్తి, రాయలసీమ సాగునీటి హక్కుల పరిరక్షణ కోసం పార్టీ చేపట్టిన పోరుబాట కార్యక్రమానికి తమ పూర్తి మద్దతు ఉంటుందని వారు పేర్కొన్నారు.

## హంద్రీనీవా పేరుతో వైసీపీ రాజకీయాలు చేస్తోంది

**- హంద్రీనీవా కాలువ విస్తరణ పనులను పరిశీలించిన మంత్రి పయ్యావుల కేశవ్**

**- జగన్ ప్రభుత్వం ప్రాజెక్టును నిర్లక్ష్యం చేసిందని విమర్శలు**



**ఉరవకొండ - సూర్య వాస్తవం :** రాష్ట్ర ఆర్థిక, ప్రణాళిక, వాణిజ్య పన్నులు మరియు శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి పయ్యావుల కేశవ్, ప్రభుత్వ విప్, రాయదుర్గం ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులతో కలిసి ఉరవకొండ పట్టణ సమీపంలోని హంద్రీనీవా కాలువ విస్తరణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, 2014--19 మధ్య హంద్రీనీవా కాలువ విస్తరణ పనులు వేగంగా సాగాయని, అనంతరం అధికారంలోకి వచ్చిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం వాటిని నిలిపివేసిందని ఆరోపించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేసి, గత ఏడాది 60 టీఎంసీలకు పైగా నీటిని తరలించడం సాధ్యమైందని పేర్కొన్నారు. జగన్ ప్రభుత్వం హంద్రీనీవా ప్రాజెక్టును నిర్లక్ష్యం చేసిందని, విస్తరణ పేరుతో ప్రజలను తప్పుదోవ పట్టించిందని మంత్రి విమర్శించారు. గతంలో పనులను అడ్డుకున్న నాయకులకు ఇప్పుడు ప్రాజెక్టుపై మాట్లాడే నైతిక హక్కు లేదని అన్నారు. రాయలసీమ సాగునీటి ప్రాజెక్టుల విషయంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చిత్తశుద్ధిని ఇటీవల వైసీపీ మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వర్ రెడ్డి కూడా ప్రస్తావించారని మంత్రి గుర్తుచేశారు. వైసీపీ నాయకులు హంద్రీనీవా అంశంపై రాజకీయాలు చేస్తు న్నారని ఆరోపించిన ఆయన, ప్రజలు భవిష్యత్తులో కూడా చంద్రబాబు నాయుడు నాయకత్వానికే మద్దతు ఇస్తారని విశ్వాసం వ్యక్తం చేశారు.

## ఉత్తమ ప్రతిభ కనబరిచిన మోడల్ స్కూల్ విద్యార్థిలకు

**- ఆర్థిక శాఖ మంత్రి,కలెక్టర్ చేతుల మీదుగా ప్రశంసా పత్రం అందజేత**



**పామిడి- సూర్య వాస్తవం:** పామిడి మోడల్ స్కూల్ విద్యార్థిని పదో తరగతి పరీక్ష ఫలితాల్లో మండల టాపర్గా నిలిచినందుకు సోమవారం ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా ప్రశంస పత్రం అందుకున్న మోడల్ స్కూల్ విద్యార్థినీ మనస్విని ఎం మోక్ష ఇరువురికి ప్రతిభ కనబరిచినందుకు మండల విద్యాశాఖ అధికారులు మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ అరుణకుమారి మా స్కూల్ ముందంజలో ఉందని గర్వంగా ఉందని స్కూల్ ప్రిన్సిపాల్ అరుణకుమారి స్కూల్ యజమాన్యం ఉత్తమ ప్రతిభ కనబరిచిన మనస్వినినీకీ మరెన్నో అవార్డులు రావాలని అభినందనలు తెలియజేశారు.

# హంద్రీనీవా పరిరక్షణకు వైసీపీ పోరుబాట..

**- చోళసముద్రం వద్ద కాలువ పరిశీలన**
**- హంద్రీనీవా లైనింగ్ పనుల్లో అవినీతి జరిగిందని ఆరోపణలు**
**- ప్రాజెక్టు సామర్థ్యాన్ని 11,500 క్యూసెక్కులకు పెంచాలని డిమాండ్**





**ఉరవకొండ - సూర్య వాస్తవం :** హంద్రీనీవా ప్రాజెక్టు పరిరక్షణ, గ్రేటర్ రాయలసీమ సాగునీటి హక్కుల సాధన కోసం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పోరాటాన్ని ఉధృతం చేసింది. పార్టీ నిర్ణయం మేరకు ఆదివారం ఉరవకొండ నియోజకవర్గంలోని కూడేరు మండలం చోళసముద్రం సమీపంలో హంద్రీనీవా కాలువను వైసీపీ నేతలు పరిశీలించారు. సుమారు రెండు కిలోమీటర్ల మేర రైతులు, పార్టీ శ్రేణులతో కలిసి పాదయాత్ర నిర్వహించి కాలువ లైనింగ్ పనులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో వైసీపీ అనంతపురం జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి, నంద్యాల జిల్లా అధ్యక్షుడు కాటసాని రాంభూపాల్‌రెడ్డి, కర్నూలు జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్‌రెడ్డి, మాజీ మంత్రి శైలజానాథ్, మాజీ ఎమ్మెల్యేలు విశ్వేశ్వరరెడ్డి, కేతిరెడ్డి పెద్దారెడ్డి, మాజీ ఎంపీ రంగయ్య, ఎమ్మెల్సీ మంగమ్మ, నైరుతిరెడ్డి, నార్పల సత్యనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు. అనంతరం మీడియాతో మాట్లాడిన నాయకులు హంద్రీనీవా ప్రాజెక్టు నిర్మాణానికి దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి చేసిన కృషిని గుర్తుచేశారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో కాలువ సామర్థ్యాన్ని 6,300 క్యూసెక్కులకు పెంచే చర్యలు చేపట్టామని, ప్రస్తుతం కూటమి ప్రభుత్వం టెండర్లు రద్దు చేసి ప్రాజెక్టు సామర్థ్యాన్ని 3,850 క్యూసెక్కులకే పరిమితం చేసిందని ఆరోపించారు. భవిష్యత్తులో అధికారంలోకి వస్తే హంద్రీనీవా సామర్థ్యాన్ని 11,500 క్యూసెక్కులకు విస్తరిస్తామని ప్రకటించారు. నంద్యాల జిల్లా అధ్యక్షుడు కాటసాని రాంభూపాల్‌రెడ్డి మాట్లాడుతూ రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు పనులను నిలిపివేయడం వల్ల ప్రాంతానికి అన్యాయం జరిగిందన్నారు. కర్నూలు జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్‌రెడ్డి హంద్రీనీవా లైనింగ్ పనుల్లో నాసిరకం నిర్మాణం, అవినీతి జరిగిందని ఆరోపిస్తూ సమగ్ర విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. మాజీ మంత్రి శైలజానాథ్ మాట్లాడుతూ హంద్రీనీవా లైనింగ్ పనుల్లో వందల కోట్ల రూపాయల దోపిడీ జరిగిందని ఆరోపించారు. మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి మాట్లాడుతూ ప్రాజెక్టు విస్తరణ పనులు సక్రమంగా జరగలేదని, భారీ వ్యయం చేసినప్పటికీ రైతులకు ఆశించిన స్థాయిలో నీరు అందలేదని విమర్శించారు.రైతుల ప్రయోజనాల దృష్ట్యా హంద్రీనీవా ప్రాజెక్టును పూర్తిస్థాయిలో అమలు చేసి, అవసరమైన సమయంలో సాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు.హంద్రీ-నీవా కాలువ లైనింగ్‌తో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. హంద్రీ-నీవా కాలువకు లైనింగ్ వేయడం వల్ల చుట్టుపక్కల ప్రాంతాల్లో భూగర్భ జలాలు క్రమంగా తగ్గిపోయి, అనేక బోర్లు ఎండిపోయాయని వై. విశ్వేశ్వరరెడ్డి ఆరోపించారు. దీంతో రైతులు ఎంతో కాలంగా సాగు చేస్తున్న చీనీ తోటలు ఎండి పోతుండగా, వాటిని కాపాడుకోవడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు.అలాగే ఈ ఏడాది ఆశించిన స్థాయిలో వర్షాలు కురవకపోవడంతో సాగు చేసిన పంటలు కూడా ఎండిపోయి, రైతులు తీవ్ర ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

హంద్రీ-నీవా కాలువ లైనింగ్ పనులు ప్రారంభమైనప్పుడే భూగర్భ జలాలపై ప్రతికూల ప్రభావం ఉంటుందని రైతులను తాము హెచ్చరించామని, అయితే ఆ సమయంలో చాలా మంది రైతులు ఆ విషయాన్ని నమ్మలేదని తెలిపారు. ఇప్పుడు పరిస్థితి కళ్లముందు కనిపించడంతో రైతులు కూడా సమస్యను అర్థం చేసుకుని తమతో కలిసి "పోరుబాట" కార్యక్రమంలో పాల్గొంటున్నారని వై. విశ్వేశ్వరరెడ్డి పేర్కొన్నారు. కె.వి. రమణ మాట్లాడుతూ హంద్రీ--నీవా కింద రైతులకు సాగునీరు అందించాలని, లేకపోతే లైనింగ్ తొలగించాలని రైతులు డిమాండ్ చేస్తున్నారని తెలిపారు. లైనింగ్ కారణంగా భూగర్భ జలాలు తగ్గి పండ్ల తోటలు ఎండిపోతున్నాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారని పేర్కొన్నారు. నార్పల సత్యనారాయణరెడ్డి మాట్లాడుతూ గ్రేటర్ రాయలసీమ సాగునీటి ప్రాజెక్టుల సాధన కోసం ప్రత్యేక కార్యాచరణతో ముందుకు సాగుతున్నామని, రానున్న రోజుల్లో రాయలసీమ వ్యాప్తంగా ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని తెలిపారు.

## భూసార పరీక్ష కేంద్రం పని చేస్తోందా...?

**- డా. ముచ్చుకోట సురేష్ బాబు**





**అనంతపురం - సూర్య వాస్తవం :** మాది రైతు ప్రభుత్వం అంటే మాదే నిజమైన రైతు ప్రభుత్వం అంటూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు రైతు సంక్షేమం కోసం ఎంత ఆరాట పడుతున్నారో నిశితంగా పరిశీలిస్తే తెలుస్తుంది. కేంద్ర ప్రభుత్వం 2015 ఫిబ్రవరిలో భూసార పరీక్షా కార్యక్రమం అట్టహాసంగా ప్రారంభించినది. మొదటి దఫా దేశంలో 12 కోట్ల రైతులకు సాయిల్ హెల్త్ కార్డ్స్ ఇచ్చినట్లు ప్రకటించారు. 2018 లో రెండో దఫా 11 కోట్ల రైతులకు సాయిల్ హెల్త్ కార్డ్స్ జారీ చేసినట్లు ప్రభుత్వ వెబ్సైటులో సమాచారం పొందుపరచారు. దేశంలో 7949 సాయిల్ టెస్టింగ్ ల్యాబ్స్ ఉన్నాయి. ఇవి ఏమాత్రం సరిపోవు. 82 గ్రామాలకు ఒక ల్యాబ్ ఉంది. కేవలం 7949 భూసార పరీక్షా కేంద్రాలు 23 కోట్ల కార్డులు ఎలా పంపిణీ చేశారో అర్థం చేసుకోవచ్చు. 98 శాతం రైతులకు వారు సాగు చేసే భూమి లోని



లోపాలు గురించి తెలియదు. తెలిసినా దానికి తరుణోపాయం వ్యవసాయ అధికారులు తెలుపరు. అనంతపురం జిల్లా కేంద్రంలో ఒకటి కదిరి పెనుకొండ లో రెండు సబ్ యూనిట్లు ఉన్నవి. గత ఆరు సంవత్సరాలుగా ఇవి నిస్తేజంగా ఉన్నాయి. నెలకు కనీసం పది మట్టి నమూనాలు పరీక్షించిన సందర్భాలు లేవు. ప్రభుత్వ భూసార పరీక్షా కేంద్రాలలో మట్టి పరీక్షలు జరపడానికి కావాల్సిన పరికరాలు, బఫర్ సొల్యూషన్స్, రియజెంట్లు లేక చాలా కాలం అవుతున్నది. మట్టి సేకరించడానికి మొబైల్ టెస్టింగ్ వాహనం ప్రమాదం జరిగి ఏడు సంవత్సరాలుగా నిరుపయోగంగా ఉంది. చాలా గ్రామాలల్లో మట్టి సేకరణ జరుగలేదు కానీ సాయిల్ హెల్త్ కార్డులు జారీ చేశారు. ఉన్న పరీక్షా కేంద్రంలో సిబ్బంది చాలా తక్కువ. రైతు తీసుకెళ్లిన మట్టి నమూనాలో వీరు పరీక్ష చేసేది కేవలం ఎన్పికే మాత్రమే మైక్రో న్యూట్రీషియన్ టెస్టు, భార లోహాలు టెస్టు, సల్ఫర్, జింక్, మాంగనీస్ ఇతరత్ర పరీక్షలు నిర్వహించరు. ఆరుగురు మంది సిబ్బంది ఉమ్మడి జిల్లాలో ఉన్న రైతులందరికీ హెల్త్ కార్డులు జారీ చేసారంటే అది సాధ్యపడే విషయమేనా? రైతులందరికీ కార్డులు ఇవ్వాలంటే 70 ల్యాబ్స్ అవసరం అవుతాయి. ఈ కార్యాలయాలు చూసిన తర్వాత ప్రతి ఒక్కరికీ వచ్చే సందేహం ఇవి నిరర్థక ఆస్తుల జాబితాలో ఉంటే ఎంత బాగుండు అనిపిస్తుంది. అందువల్ల గ్రామీణ నిరుద్యోగులకు టెస్టింగ్ ల్యాబ్‌ను ప్రారంభించాలని యోచిస్తున్న ఔత్సాహికులకు రెండు ఆప్షన్లు అందు బాటులో ఉన్నాయి. షాప్ రెంట్‌కు తీసుకొని పని చేయడం ఒక పద్ధతి. మొబైల్ టెస్టింగ్ ల్యాబ్స్ రెండో ఆప్షన్. ఇందులో ఒక వెహికల్‌పై ల్యాబ్‌ను ఏర్పాటు చేసుకోవాలి. సాయిల్ టెస్టింగ్ కేంద్రాల సంఖ్యను బాగా పెంచాలని కేంద్ర ప్రభుత్వం యోచిస్తోంది. కానీ ఇంతవరకు అమలుకు నోచుకోలేదు. గ్రామాల్లో ఉన్న వారు ఈ స్కీమ్‌కు అర్హులు. 18 నుంచి 40 ఏళ్ల మధ్యలో వయసు ఉండాలి. రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతి రెండేళ్లకు ఒకసారి మట్టి కండీషన్ ఎలా ఉందో తెలుసుకోవడానికి సాయిల్ టెస్ట్ చేస్తూ ఉంటాయి. దీని ద్వారా నేలలో ఏ ఏ పోషకాలు తక్కువగా ఉన్నాయో తెలుసుకోవచ్చు.

## విద్యార్థి నాయకుడి కీచక పర్వం

**- ప్రేమ పేరుతో మోసం చేశాడంటూ విద్యార్థి నాయకుడిపై యువతి ఆరోపణలు**



**అనంతపురం సిటీ - సూర్య వాస్తవం :** ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కుల్లాయి స్వామిపై ఓ యువతి తీవ్ర ఆరోపణలు చేసింది. ప్రేమ పేరుతో తనను నమ్మించి, పెళ్లి చేసుకుంటానని హామీ ఇచ్చి శారీరకంగా దగ్గరై, అనంతరం ఇప్పుడు తనను వదిలించుకునేందుకు ప్రయత్నిస్తున్నాడని ఆరోపించింది. యువతి తెలిపిన వివరాల ప్రకారం, 2021లో పరిచయం ఏర్పడిన అనంతరం కుల్లాయి స్వామి ప్రేమిస్తున్నానని చెప్పి తన చదువుకు సహాయం చేశాడని, తర్వాత పెళ్లి చేసుకుంటానని నమ్మించి 2024లో శారీరక సంబంధం పెట్టుకున్నాడని పేర్కొంది. 2026లో ఊరి బయటకు తీసుకెళ్లి పసుపు తాడు కట్టి పెళ్లి అయినట్లుగా చెప్పాడని, అయితే ఫొటోలు తీయాలన్న తన అభ్యర్థనను "తాను ఏఐఎస్ఎఫ్ నాయకుడినని, విషయం బయటకు రావద్దని" చెప్పి నిరాకరించాడని ఆరోపించింది. ఇటీవల అతని ప్రవర్తనపై అనుమానం రావడంతో ఫోన్ పరిశీలించగా మరో యువతితో ఉన్న ఫొటోలు కనిపించాయని, దీనిపై ప్రశ్నించగా తనపైనే అక్రమ సంబంధాల ఆరోపణలు చేస్తూ తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నాడని తెలిపింది. ఈ విషయమై సుమారు 15 రోజుల క్రితం సీపీఐ కార్యాలయంలో ఫిర్యాదు చేసినా పార్టీ నాయకులు స్పందించలేదని, దీంతో జిల్లా ఎస్పీని కలిసి ఫిర్యాదు చేసినట్లు యువతి వెల్లడించింది. ఎస్పీ సూచన మేరకు రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని సూచించినట్లు తెలిపింది. తన వద్ద వాట్సాప్ చాటింగ్‌లు, పుట్టినరోజు సందర్భంగా కలిసి దిగిన ఫొటోలు వంటి ఆధారాలు ఉన్నాయని, తనకు న్యాయం చేయాలని యువతి విజ్ఞప్తి చేసింది.



# ప్రజా సమస్యల పరిష్కారంలో అలసత్వం వద్దు

**- అందిన ప్రతి అర్జీని సకాలంలో పరిష్కరించాలి**
**- పిజిఆర్ఎస్‌లో అధికారులకు జిల్లా కలెక్టర్ హెచ్చరిక**



**శ్రీ సత్యసాయి బ్యూరో– సూర్య వాస్తవం:** ప్రజా సమస్యల పరిష్కారమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని.. ప్రజల నుంచి వచ్చిన ప్రతి అర్జీని బాధ్యతాయుతంగా పరిశీలించి నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ఏ. శ్యాంప్రసాద్ అధికారులను ఆదేశించారు.సోమవారం పుట్టపర్తి రైల్వే స్టేషన్ సమీపంలోని రెవెన్యూ భవన్‌లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజల వినతులను కలెక్టర్ స్వీకరించి సంబంధిత శాఖల అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులు, వినతులను నిర్లక్ష్యం చేయకుండా సత్వరమే పరిశీలించి అర్హత మేరకు పరిష్కరించాలని సూచించారు. ప్రభుత్వ సేవలను ప్రజలకు మరింత చేరువ చేయడంలో అధికారులు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు ప్రభుత్వం అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తోందని, వాటి ఫలాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో మొత్తం 421 అర్జీలు రాగా వాటిపై తగు చర్య తీసుకొని పరిష్కరించు నిమిత్తం సంబంధిత శాఖల అధికారులకు కలెక్టర్ ఎండార్స్ చేశారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఎం. మౌర్య భరద్వాజ్, డీఆర్‌ఓ కొండయ్య,ఎస్‌డిసి విజయ కుమారి, పుట్టపర్తి ఆర్డీఓ సువర్ణ, వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# జంతర్ మంతర్ ఉద్యమానికి సంఘీభావంగా నిరసన




**అనంతపురం సిటీ – సూర్య వాస్తవం :** నీట్ పేపర్ లీకులు, విద్య, పరీక్షల వ్యవస్థలో పెరుగుతున్న అవినీతి, నిరుద్యోగ యువత భవిష్యత్తుతో జరుగుతున్న అన్యాయానికి వ్యతిరేకంగా ఢిల్లీ జంతర్ మంతర్ వద్ద కొనసాగుతున్న ఉద్యమానికి సంఘీభావంగా సోమవారం అనంతపురంలో సిపిఐ(ఎంఎల్) లిబరేషన్ పార్టీ, ఐఎఫ్‌టియూ, ఇతర ప్రజాసంఘాల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించబడింది. ఈ సందర్భంగా సిపిఐ యమ్ యల్ లిబరేషన్ పార్టీ జిల్లా కార్యదర్శి వేమన, ఆర్ వి ఎస్ వెంకటేష్, ఐఎఫ్ టియూ నగర అధ్యక్షుడు దావీదు మాట్లాడుతూ, దేశవ్యాప్తంగా వరుసగా జరుగుతున్న పేపర్ లీకులు లక్షలాది మంది విద్యార్థులు, నిరుద్యోగ యువత జీవితాలతో చెలగాటమం ఆడుతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యను కార్పొరేటీకరణ చేయడం, నియామక ప్రక్రియలను అవినీతితో నింపడం వల్ల ప్రతిభకు విలువ లేకుండా పోతోందని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం ఈ పరిస్థితిని అరికట్టడంలో పూర్తిగా విఫలమైందని పేర్కొన్నారు. ఢిల్లీ జంతర్ మంతర్ వద్ద విద్యార్థులు, యువజన సంఘాలు చేపట్టిన పోరాటం దేశంలోని ప్రతి విద్యార్థి, ప్రతి నిరుద్యోగ యువకుడి గొంతుక అని, ఈ ఉద్యమానికి ప్రజలందరూ సంఘీభావం తెలియజేయాలని పిలుపునిచ్చారు. పేపర్ లీకులకు బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, పరీక్షల వ్యవస్థను పారదర్శకంగా నిర్వహించాలని, అవినీతికి అడ్డుకట్ట వేయాలని, నిరుద్యోగ యువతకు న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ (ఎంఎల్) లిబరేషన్ పార్టీ జిల్లా కమిటి సభ్యులు టి.యస్ వలి, పరుశురాముడు, బాలకృష్ణ, ఐఎఫ్ టియూ నాయకులు రామాంజి, ఈశ్వరయ్య , నాగభూషణ, ఓన్నారు, రవి, యన్ ఎస్ యు ఐ నాయకులు ప్రసాద్, రాయలసీమ విద్యావంతుల వేదిక నాయకులు వివిధ ప్రజాసంఘాల నాయకులు నాగన్న తదితరులు పాల్గొని జంతర్ మంతర్ ఉద్యమానికి తమ పూర్తి మద్దతును ప్రకటించారు.

## ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థికి గుర్తింపు

**- ఆర్థికశాఖమంత్రి, కలెక్టర్ చేతుల మీదుగా ప్రశంసా పత్రం**



**పెద్దపప్పూరు – సూర్య వాస్తవం :** మండల కేంద్రమైన పెద్దపప్పూరు మౌర్య హై స్కూల్ విద్యార్థికీ 10వ.తరగతి పరీక్షా ఫలితాల్లో మండలంలోనే జూలా కాలువ ప్రణీతకు 583 ప్రథమ స్థాయిని సాధించినందులకు వారి ప్రతిభకు ఫలితముగా సోమవారం ఆర్థిక శాఖమంత్రి పయ్యావుల కేశవ్,జిల్లాకలెక్టర్ ఆనంద్ చేతుల మీదుగా ప్రశంస పత్రాలు అందుకున్నారు.మండల విద్యాశాఖ అధికారులు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రైవేటు పాఠశాల ముందంజలో ఉన్నందున గర్వంగా ఉందని ప్రిన్సిపల్ ఆదినారాయణ ఉత్తమప్రతిభ కనబరిచిన ప్రణిత కు మరెన్నో అవార్డులు సాధించాలని అభినందనలు తెలియజేశారు. విద్యార్థుల తల్లిదండ్రులు పాఠశాల బృందానికి ధన్యవాదాలు తెలిపారు.

## ఘనంగా ప్రారంభమైన 'డ్రిప్ వారోత్సవాలు '

**శ్రీ సత్య సాయి బ్యూరో – సూర్య వాస్తవం:** జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా ఉన్న 256 రైతు సేవా కేంద్రాల్లో సోమవారం నుండి 'డ్రిప్ వారోత్సవాలు' ఘనంగా ప్రారంభమయ్యాయి. తొలిరోజే 1,800 మంది రైతులు డ్రిప్ సిస్టమ్స్ కోసం తమ పేర్లను నమోదు చేసుకున్నారు. ఈ ప్రారంభ కార్యక్రమాల్లో ఏపీఎంఐపీ ప్రాజెక్ట్ డైరెక్టర్, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి కె. జయకుమార్, మండలాధికారులు, గ్రామ వ్యవసాయ, ఉద్యానవన సహాయకులు, వివిధ డ్రిప్ కంపెనీల జిల్లా కోఆర్డినేటర్లు మరియు పెద్ద సంఖ్యలో రైతులు పాల్గొన్నారు. రైతులందరూ తమ పరిధిలోని రైతు సేవా కేంద్రాల ద్వారా ఈ సదుపాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని అధికారులు కోరారు.




## మున్సిపాలిటీలో నెలకొన్న సమస్యలపై మున్సిపల్ కమిషనర్‌కు బిజెపి నాయకుల వినతి



**గుత్తి – సూర్య వాస్తవం:** గుత్తి మున్సిపాలిటీ పరిధిలో నెలకొన్న సమస్యల గురించి సోమవారం ప్రజా ఫిర్యాదుల దినోత్సవం సంద ర్భంగా భారతీయ జనతా పార్టీ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో పట్టణ ఉపా ధ్యక్షుడు మాణిక్యం ఆచారి అధ్యక్ష తన స్థానిక మున్సిపాలిటీ పరిధిలో ప్రధానంగా డ్రైనేజీ వ్యవస్థను,వీధి లైట్లను,స్పాట్ డెలివరీ ట్యాంకుల ను,పైప్ లైన్ల లీకేజీలను పునరుద్ధరించాలంటూ మున్సిపల్ కమిషనర్ కి వినతి పత్రం ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు పాలమూరి బాబయ్య,బీజేకెఎం జోనల్ ఇన్చార్జ్ తెగదొడ్డి తిమ్మారెడ్డి, అనంతపురం జిల్లా కార్యదర్శులు కవితా శర్మ, నారాయణ రెడ్డి తదితర నాయకులు ,కార్యకర్తలు పాల్గొన్నారు.

## వృద్ధులకు నిర్ణీత తేదీలోపు సక్రమంగా రేషన్ పంపిణీ చేయాలి

**- ఎమ్మార్వో షర్మిల**



**పామిడి– సూర్య వాస్తవం:** పామిడి పట్టణంలోని స్థానిక మండల రెవెన్యూ కార్యాలయంలో సోమవారం మండల తహసిల్దార్ షర్మిల ఆధ్వర్యంలో ప్రభుత్వ చౌక ధాన్యపు దుకాణం డీలర్ల సమా వేశం నిర్వహించారు. ఈ సంద ర్భంగా తహసిల్దార్ షర్మిల, సిహెచ్ డిటి కంబక్క మాట్లాడుతూ 60 సంవత్సరాల నుంచి పైన గల వృద్ధులకు ప్రతినెల 26 నుంచి 31వ తేదీ లోపు వారి ఇంటి దగ్గరికి వెళ్లి బియ్యం పంపిణీ చేయాలన్నారు. ఒకవేళ వారు వేలిముద్రలు (తమ్ము) పట్టు కోకపోతే వారి సంబంధించిన కుటుంబ సభ్యులలో ఒకరిది తమ్ము వేయించాలన్నారు. ఈ సందర్భంగా డీలర్లు ముక్కు ముడిగా ప్రతినెల బియ్యం బస్తాలు తూకం తక్కువ వస్తున్నాయని దీనివల్ల లబ్ధిదారులతో అధికారులతో సమస్య జటిలమైపోతున్న దన్నారు. ఈ విషయమై అధికారులకు గుత్తి బియ్యం గోడౌన్ వారికి ఎన్నిసార్లు విన్నవించుకున్న ఫలితం లేదన్నారు. గోడౌన్లో బియ్యం దొంగలిస్తున్నారని ఇది డీలర్లకు ప్రధాన సమస్యగా మారిందన్నారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ షర్మిల, సిహెచ్ డిటి కంబక్క, ఏపీవో ఆదినారాయణమ్మ,, ఆర్ఐ గాయత్రి, వీఆర్వో గోపాల్ రెడ్డి, డీలర్లు తదితరులు పాల్గొన్నారు.

## రవీంద్రనాథ్ రెడ్డి మరణం వినియోగదారుల ఉద్యమానికి తీరని లోటు :షేక్ అసిన్ వలి

**- ఘనంగా నివాళులు అర్పించిన అనంతపురం జిల్లా విజిలెన్స్ కమిటీ సభ్యులు**

**అనంతపురం – సూర్య వాస్తవం :** అనంతపురం జిల్లా వినియోగదారుల సంఘాల సమాఖ్య అధ్యక్షులు, రాష్ట్ర విజిలెన్స్ కమిటీ సభ్యులు, జిల్లా వినియోగదారుల సమాచార కేంద్రం అధ్యక్షులు పి. రవీంద్రనాథ్ రెడ్డి హైదరాబాద్‌లో చికిత్స పొందుతూ పరమపదించడం వినియోగదారుల ఉద్యమానికి తీరని లోటని అనంతపురం జిల్లా వినియోగదారుల సంఘాల సభ్యులు షేక్ అసిన్ వలి పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..... రవీంద్రనాథ్ రెడ్డి సుమారు 25 సంవత్సరాలకు పైగా వినియోగదారుల ఉద్యమంలో వివిధ హోదాల్లో సేవలందిస్తూ, వినియోగదారుల హక్కుల పరిరక్షణ, సమస్యల పరిష్కారం, ప్రజల్లో వినియోగదారుల చట్టాలపై అవగాహన కల్పించడంలో విశేష కృషి చేశారు. అలాగే ఇండియన్ నేషనల్ ట్రస్ట్ ఫర్ ఆర్ట్ అండ్ కల్చరల్ హెరిటేజ్....జీవిత సభ్యునిగా భారతీయ కళా, సాంస్కృతిక వారసత్వ పరిరక్షణకు కూడా సేవలందించారు. వారి భౌతిక కాయాన్ని సందర్శించిన జిల్లా వ్యాప్తంగా ఉన్న వినియోగదారుల నాయకులు పుష్పాంజలి ఘటించి, ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆర్. శ్రీనివాసులు మాట్లాడుతూ...... రవీంద్రనాథ్ రెడ్డి గారి సేవలు విని యోగదారుల ఉద్యమ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతాయి. వారి మరణంతో ఉద్యమం ఒక సమర్థ నాయకుడిని కోల్పోయింది. వారి ఆశయాలను ముందుకు తీసుకెళ్లడం ద్వారానే వారికి నిజమైన నివాళి అర్పించిన వారమవుతాము" అని అన్నారు. ఈ కార్యక్రమంలో వినియోగదారుల సంఘం నాయకులు చంద్ర మహేష్, కృష్ణమూర్తి, శేషాద్రి, చిన్నప్ప, సాంబశివుడు, మరి స్వామి, అనంతపురం జిల్లా విజిలెన్స్ కమిటీ సభ్యులు తోట చెన్నప్ప, స్టేట్ కమిటీ సభ్యులు చంద్ర,మహేష్, ఆశా, భార్గవ్ రాజా, బాలన్న,లీగల్ మెట్రోలోజి శంకర్ తదితరులు పాల్గొని రవీంద్రనాథ్ రెడ్డి కి ఘనంగా నివాళు లర్పించారు.

## షైనింగ్ స్టార్స్ - 2026 అవార్డుల వేడుక ఘనంగా నిర్వహణ



**అనంతపురం సిటీ – సూర్య వాస్తవం :** విద్యార్థుల ప్రతిభను గుర్తించి, వారిని మరింత ఉన్నత లక్ష్యాల వైపు ప్రోత్సహించాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన "షైనింగ్ స్టార్స్ -- 2026" అవార్డుల కార్యక్రమం అనంతపురం నగరంలోని జేఎన్టీయూ విశ్వ విద్యాలయం ఎన్టీఆర్ ఆడిటోరియంలో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి రాష్ట్ర ఆర్థిక, ప్రణాళిక, వాణిజ్య పన్నులు మరియు శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ ముఖ్య అతిథిగా హాజరై, పదో తరగతి ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు గోల్డ్ మెడల్స్ ప్రదానం చేసి అభినందించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, విద్యా ర్థులు సాధించిన విజయాలను తొలి మెట్టుగా భావించి, ఇదే పట్టుదలతో ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకోవాలని సూచించారు. విద్యతో పాటు నైతిక విలువలు, క్రమశిక్షణ, సామాజిక బాధ్యతను అలవర్చుకొని రాష్ట్రానికి, దేశానికి ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్ కలెక్టర్ ఓ ఆనంద్, టీడీపీ నాయకుడు వెంకటశివుడు యాదవ్, విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, విద్యాశాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు

## ప్రజాదర్బార్‌లో ప్రజా సమస్యల పరిష్కారానికి మంత్రి పయ్యావుల కేశవ్ కృషి

**అనంతపురం సిటీ – సూర్య వాస్తవం:** అనంతపురంలోని రామ్‌నగర్‌లో ఉన్న రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి క్యాంపు కార్యా లయంలో గురువారం నిర్వహించిన "ప్రజాదర్బార్" కార్యక్రమంలో రాష్ట్ర ఆర్థిక, ప్రణాళిక, వాణిజ్య పన్నులు మరియు శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ ప్రజల నుంచి వినతి పత్రాలను స్వీకరించారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజలు, ప్రజా ప్రతినిధులు, నాయకులు తమ సమస్యలను మంత్రి దృష్టికి తీసుకురాగా, ప్రతి వినతిపత్రాన్ని పరిశీలించి సంబంధిత అధికారులతో సమన్వయం చేసి సమస్యల పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.ఈ సందర్భంగా మంత్రి పయ్యావుల కేశవ్ మాట్లాడుతూ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం ప్రజా సమస్యల పరిష్కారానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. అభివృద్ధి, సంక్షేమం తమ ప్రభుత్వానికి రెండు కళ్లు వంటివని పేర్కొంటూ, రాష్ట్రంలోని అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకుంటూనే, రాష్ట్ర అభివృద్ధికి కీలక కార్యక్రమాలను అమలు చేస్తున్నామని తెలిపారు. ప్రజల సమస్యలు ఎలాంటి ఆలస్యం లేకుండా పరిష్కారమయ్యేలా సంబంధిత శాఖల అధికారులకు తక్షణమే ఆదేశాలు జారీ చేసి, ప్రతి వినతిపత్రంపై సానుకూల చర్యలు తీసుకునేలా చర్యలు చేపడతామని మంత్రి స్పష్టం చేశారు.



## బీసీల మంచి కోరే నాయకుడు మంత్రి మండిపల్లి

- రాయచోటి రూరల్ టిడిపి అధ్యక్షుడు గండికోట సుధాకర్.



**రాయచోటి–సూర్య వాస్తవం:** బడుగు బలహీన వర్గాల కోసం అహర్నిషలు కృషి చేసే నేత మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి అని కొనియాడారు రాయచోటి రురల్ అధ్యక్షుడు గండికోట సుధాకర్.ఈ సందర్భంగా రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పాలన,రాయచోటి నియోజకవర్గంలో మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి చూపిస్తున్న ఆదరణ,అభివృద్ధిని చూసి ఇతర పార్టీల నుండి టిడిపిలోకి భారీగా చేరుతున్నారు.అందులో భాగంగా ఇటీవలే లక్కిరెడ్డిపల్లి మండలం కు చెందిన మాజీ ఎంపిపి అంబాబత్తిన రెడ్డయ్య తన అనుచరులతో కలిసి మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి ఆధ్వర్యంలో పార్టీలో చేరారు.ఈ సందర్భంగా అయన పార్టీ మారడం పట్ల అయన పై విమర్శలు చేస్తున్న వారు ఒక బిసి నేత ఎదుగుదలను చూడలేక సర్పంచ్ ఎన్నికలలో ఆ పార్టీ నేతలే కూటమిగా ఏర్పడి ఓడించిన ఘనత మేకే దక్కుతుందాన్నారు.బిసిలను ఓటు బ్యాంక్ గా మాత్రమే చూడకుండా సామజిక న్యాయంతో వారికీ పదవులు కేటాయించిన ఘనత మా మంత్రి మండిపల్లిది అని అన్నారు.ఈ కార్యక్రమంలో యూనిట్ ఇంచార్జ్ నాగార్జున రెడ్డి, వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఉదయగిరి మస్తాన్, మాజీ సర్పంచ్ బసయ్య తదితరులు పాల్గొన్నారు.

## సామాజిక బాధ్యతలో భాగంగా 10 కంప్యూటర్ల అందజేత

– రూ.8 లక్షల విలువైన కంప్యూటర్ పరికరాలు
అందించిన యూనియన్ బ్యాంక్




**అన్నమయ్య బ్యూరో –సూర్య వాస్తవం:** సామాజిక బాధ్యతలో భాగంగా యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మదనపల్లె శాఖ ఆధ్వర్యంలో రూ.8 లక్షల విలువైన 10 కంప్యూటర్ సిస్టమ్స్‌ను జిల్లా యంత్రాంగానికి అందజేశారు.సోమవారం మదనపల్లె కలెక్టరేట్‌లోని కోర్టు హాల్లో యూనియన్ బ్యాంక్ ప్రతినిధులు ఈ కంప్యూటర్ సిస్టమ్స్‌ను జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్‌కు అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ మాట్లాడుతూ.. సామాజిక బాధ్యతగా ముందుకు వచ్చి ప్రభుత్వ కార్యాలయాలకు కంప్యూటర్ పరికరాలను అందజేసిన యూనియన్ బ్యాంక్ ప్రతినిధులను అభినందించారు. ప్రభుత్వ సేవలను మరింత సమర్థవంతంగా, వేగంగా అందించేందుకు ఇలాంటి సహకారం ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. సామాజిక బాధ్యతలో భాగంగా ప్రభుత్వ అవసరాలకు తోడ్పడుతూ, ప్రజా సేవల్లో భాగస్వాములవుతున్న సంస్థలు మరిన్ని ముందుకు రావాలని కలెక్టర్ ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ బ్యాంక్ కడప రీజినల్ హెడ్ ఎ.లక్ష్మీ తులసి, చీఫ్ మేనేజర్ జి. సతీష్ కుమార్, సీనియర్ మేనేజర్ పవన్ కుమార్, అసిస్టెంట్ మేనేజర్ సి. ఛత్రపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామిని దర్శించుకున్న ఆప్కో చైర్మన్, జిల్లా డిసిసి బ్యాంక్ చైర్మన్‌లు



**బ్రహ్మంగారి మఠం – సూర్య వాస్తవం:** జగద్గురు శ్రీమద్విరాట్ పోతులూరి శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామి వారిని సోమవారం ఆంధ్రప్రదేశ్ ఆప్కో చైర్మన్ గన్ని వీరాంజనేయులు, బద్వేల్ తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ మరియు ఉమ్మడి కడప జిల్లా డీసీసీ బ్యాంక్ చైర్మన్ మంచూరు సూర్యనారాయణ రెడ్డి దర్శించుకున్నారు వీరికి మఠం యాజమాన్యం ప్రత్యేక స్వాగతం పలికి ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకుడు బోల శ్రీనివాసులు ,తెలుగుదేశం పార్టీ మండల నాయకులు ప్రజాప్రతినిధులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## నేడు బ్రహ్మం సాగర్ నుంచి లెఫ్ట్ కెనాల్‌కు నీటి విడుదల



**బ్రహ్మంగారి మఠం – సూర్య వాస్తవం:** బ్రహ్మంగారిమఠంలోని బ్రహ్మం సాగర్ ప్రాజెక్టు నుంచి లెఫ్ట్ కెనాల్‌కు మంగళవారం ఉదయం 10 గంటలకు మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ సాగునీటిని విడుదల చేయనున్నారు. అలాగే బద్వేల్ టిడిపి ఇన్చార్జ్ జిల్లా డిసిసి బ్యాంక్ చైర్మన్ సూర్యనారాయణ రెడ్డి పాల్గొంటారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, రైతులు, అభిమానులు, పాల్గొనాలని బ్రహ్మంగారిమఠం మండల టీడీపీ అధ్యక్షుడు చెన్నుపల్లె సుబ్బారెడ్డి, బద్వేల్ తెలుగు దేశం కార్యాలయం వారు తెలిపారు. కార్యక్రమానికి అందరూ హాజరై విజయవంతం చేయాలని ఆయన కోరారు.

# జాప్యం లేకుండా పిజిఆర్ఎస్ సమస్యలను పరిష్కరించాలి

- అర్జీదారుడు సంతృప్తి చెందేలా నాణ్యత ప్రామాణికంగా సమస్యలు పరిష్కారం చేయాలి
- జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ శర్మ



**అన్నమయ్య బ్యూరో – సూర్య వాస్తవం:** జాప్యం లేకుండా పిజిఆర్ఎస్ సమస్యలను అర్జీదారుడు సంతృప్తి చెందేలా త్వరితగతిన పరిష్కరించాలని జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ శర్మ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్లోని పిజిఆర్ఎస్ హాలు నందు... ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్) కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో జేసీతోపాటు సబ్ కలెక్టర్ చల్లా కళ్యాణి, డిఆర్ఓ వెంకటేష్, కెఆర్ఆర్సి ఎస్డిసి చంద్రశేఖర్ రెడ్డి, సర్వే శాఖ ఏడి శాంతరాజ్ ప్రజల నుండి ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా జేసి మాట్లాడుతూ ఫిర్యాదుదారుల విజ్ఞప్తులను సంబంధిత అధికారులు .. క్షేత్ర స్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి పారదర్శకంగా విచారణ చేయాలన్నారు. అర్జీదారుడు సంతృప్తిచెందేలా నిర్ణీత గడువులోపు అర్జీలను తప్పనిసరిగా పరిష్క రించాలన్నారు. పెండింగ్ దరఖాస్తులు, బియాండ్ ఎస్ఎల్ఏ, రీఓపెనింగ్.. లేకుండా అర్జీదారుడు సంతృప్తి చెందేలా అర్జీలను పరిష్కరించాలన్నారు. అనంతరం అర్జీదారులనుండి వారు అర్జీలను స్వీకరించారు.

**ప్రజల నుండి అందిన విజ్ఞప్తులలో కొన్ని**

మదనపల్లి మండలం టిడ్కో గృహాల వద్ద ఒక సంవత్సరం నుంచి వాటర్ లైన్ మెన్ లేని కారణంగా అక్కడ నివసించే వారు తీవ్ర నీటి సమస్యను ఎదుర్కొంటున్నారని.. వెంటనే మున్సిపాలిటీ నుంచి వాటర్ లైన్మెన్ ఏర్పాటుచేసి నీటి సమస్యను పరిష్కరించి ఆదుకోవాలని టిడ్కో గృహాలలో నివసించేవారు అర్జీ సమర్పించారు.



కురబలకోట మండలం తట్టు గ్రామ పంచాయితీకి చెందిన ఎస్. గోపెమ్మ... తాను తన భర్త కూలి పని చేసుకుని జీవించే వారమని, అనారోగ్యంతో 2023లో తన భర్త మృతి చెందారని, తనకు ఎలాంటి జీవనాధారం లేకుండా ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నానని, వితంతు పెన్షన్ మంజూరు చేయవలసిందిగా అర్జీ సమర్పించారు.

మదనపల్లి మండలం ఎగువ దళిత వాడకు చెందిన ఎల్.బోయ కొండప్ప నిరుపేదలైన తాము భజన కళాకారులుగా జీవనం సాగిస్తున్నామని, తనకు ఎలాంటి నివాసం లేదని, ప్రభుత్వం ద్వారా ఇంటిస్థలం, ఇల్లు మంజూరు చేయాలని కోరుతూ అర్జీ సమర్పించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# పీలేరు గ్రామపంచాయతీకి ఐఎస్ఓ గుర్తింపు

- పారదర్శక పాలన, నాణ్యమైన పౌర సేవలకు దక్కిన గౌరవం
- అన్నమయ్య జిల్లాలో ఐఎస్ఓ గుర్తింపు పొందిన తొలి గ్రామపంచాయతీగా పీలేరు
- జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్



**అన్నమయ్య బ్యూరో – సూర్య వాస్తవం:** అన్నమయ్య జిల్లాలో ఐఎస్ఓ గుర్తింపు పొందిన తొలి గ్రామ పంచాయతీగా పీలేరు నిలిచిందని... ఇందుకు కృషి చేసిన అధికారులను అభినందిస్తున్నామని జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ పేర్కొన్నారు. సోమవారం మదనపల్లె కలెక్టరేట్‌లో పీలేరు గ్రామపంచాయతీకి జారీ చేసిన ఐఎస్ఓ సర్టిఫికెట్లను పీలేరు గ్రామపంచాయతీ డెవలప్మెంట్ అధికారి రవీంద్రారెడ్డికి జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ...రాష్ట్రవ్యాప్తంగా అత్యుత్తమ పాలన, పారదర్శకత, నాణ్యమైన పౌర సేవలు అందిస్తున్న 23 గ్రామ పంచాయతీలకు అంతర్జాతీయ ప్రమాణాల ఐఎస్ఓ గుర్తింపు లభించిందని జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ తెలిపారు. ఇందులో భాగంగా పీలేరు మేజర్ గ్రామపంచాయతీకి కూడా ఐఎస్ఓ గుర్తింపు లభించడం సంతోషకరమన్నారు. గ్రామపంచాయతీ పరిధిలో పారదర్శక పాలన, మెరుగైన పరిపాలనా విధానాలు, ప్రజలకు నాణ్యమైన పౌర సేవలు అందించేందుకు తీసుకున్న చర్యలకు ఈ గుర్తింపు నిదర్శనమన్నారు. పీలేరు ఎమ్మెల్యే కిషోర్ కుమార్ రెడ్డి మరియు జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ ప్రత్యేక చొరవ, వారి సలహాలు సూచనలు పాటించడం వల్ల గ్రామపంచాయతీకి ఈ అరుదైన గుర్తింపు లభించిందని అధికారులు తమ హర్షాన్ని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి ఏ. రాధమ్మ, పీలేరు డిప్యూటీ ఎంపీడీవో యుగంధర్ రెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# కక్ష సాధింపులతో కన్నం...

- 48 గంటల్లోనే భారీ చోరీ కేసు చేదన
- ఇద్దరు వ్యక్తులను అరెస్ట్ చేసి కేసు నమోదు
- డిఎస్పి కృష్ణమోహన్





**లక్కిరెడ్డిపల్లి – సూర్యవాస్తవం:** కక్ష సాధింపులతో కన్నం వేసి 48 గంటల్లోనే 210 గ్రాములు బంగారం భారీ చోరీకి పాల్పడ్డ ఇద్దరు వ్యక్తులను అరెస్ట్ చేసి రిమాండ్‌కి పంపుతున్నట్లు రాయచోటి డిఎస్పి కృష్ణమోహన్ పేర్కొన్నారు. సోమవారం లక్కిరెడ్డిపల్లె సర్కిల్ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు.


ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఫిర్యాదు దారుడు గురువారం కోనంపేట సంతకు వెళ్లి కూరగాయల అమ్ముకోవడానికి వెళ్లగా ఇదే ఆసరాగా తీసుకున్న గాలివీడుకు చెందిన చెప్పలి కాశి తన సోదరుడైన తిరుపతికి చెందిన సాయికుమార్ ఇద్దరూ కలిసి ఎవరు లేని సమయంలో ఇంట్లో గోడ పగలగొట్టి 210 గ్రాములు బంగారాన్ని అపహరించకపోయారని 17 తేదీన గాలివీడు పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారని ఈ మేరకు ఎస్పీ ధీరజ్ కునుబిల్లి ఆదేశాల మేరకు దాడులు నిర్వహించి సోమవారం గాలివీడు పేరం క్రాస్ వద్ద ఇద్దరిని అదుపులో తీసుకొని వారి వద్ద నుంచి 210 గ్రాముల బంగారాన్ని, ఒక కెటిఎమ్ బైకును సెల్ఫోన్ స్వాధీనం చేసుకొని ముద్దాయిలు అరెస్ట్ చేసినట్లు ఆయన తెలిపారు. ముద్దాయిలు చెప్పలి కాశి డ్రైవర్ గా పనిచేసేవాడని తన మిత్రుడు తిరుపతికి చెందిన సాయికుమార్ ఎలక్ట్రికల్ పని చేసుకునే వాళ్ళని అదే పనిగా కక్షతో గోడలు పగలగొట్టి చోరీకి పాల్పడ్డారని ఆయన తెలియజేశారు. ఈ మేరకు నిందితులను అదుపులో తీసుకొని కేసు నమోదు చేసి రిమాండ్కు పంపుతున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐ కృష్ణంరాజు నాయక్ గాలివీడు ఎస్సై నర్సింహారెడ్డి సిబ్బంది పాల్గొన్నారు.

## జగద్గురు వీరబ్రహ్మేంద్రుని 'తత్వ దర్శిని' పుస్తకాన్ని ఆవిష్కరించిన మఠాధిపతి శ్రీ వీరధర్మజ వెంకటాద్రి స్వాములవారు



**బ్రహ్మంగారి మఠం – సూర్య వాస్తవం:** జగద్గురు శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి మఠం ప్రాంగణంలో ఆదివారం ఆధ్యాత్మిక, సాహిత్య వాతావరణం నడుమ ప్రముఖ రచయిత, చిలకలూరిపేటకు చెందిన సాహితి సేవారత్న పండిత దీవి రామబ్రహ్మం రచించిన "జగద్గురు వీరబ్రహ్మేంద్రుని తత్వ దర్శిని (కాళికాంబ సప్తశతి పద్మయుతము)" గ్రంథాన్ని మఠాధిపతి శ్రీ వీరధర్మజ వెంకటాద్రి స్వాములవారు ఘనంగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా స్వాములవారు మాట్లాడుతూ, శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామి వారి తత్వాలు మానవాళికి ఆధ్యాత్మిక మార్గదర్శకాలని, అలాంటి మహోన్నత భావాలను సాహిత్య రూపంలో ప్రజలకు అందించడం అభినందనీయమని పేర్కొన్నారు. పుస్తకావిష్కరణ కార్యక్రమంలో రచయిత బంధువులు మఠానికి చెందిన అధికారులు, వేద పండితులు, భక్తులు, సాహితీవేత్తలు, ప్రముఖులు పాల్గొని రచయితను అభినందించారు.

## నాలుగు షైనింగ్ స్టార్స్ అవార్డులు కైవసం చేసుకున్న విశ్వభారతి పాఠశాల విద్యార్థులు



**లక్కిరెడ్డిపల్లి – సూర్య వాస్తవం:** మార్చి 2026 పదవ తరగతి పరీక్ష ఫలితాలలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రతి సంవత్సరం ప్రభుత్వం షైనింగ్ స్టార్స్ అవార్డు రూపంలో ప్రతి మండలానికి ఆరు అవార్డులను ప్రకటిస్తుంది. అందులో భాగంగానే 2026వ సంవత్సరానికి విడుదలైన షైనింగ్ స్టార్ అవార్డులలో మండలంలో విశ్వభారతి పాఠశాలకు చెందిన విద్యార్థులే నలుగురు ఎంపిక అవ్వడం పట్ల ఎంతో గర్వించ తగ్గ విషయమని పాఠశాల డైరెక్టర్ ఆర్.రామచంద్రయ్య, కరస్పాండెంట్ కె.రఘునాథరాజులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్ రామచంద్రయ్య మాట్లాడుతూ... 2015 వ సంవత్సరం నుంచి ప్రభుత్వం ప్రతిభా అవార్డులు అందజేస్తున్నారని, అయితే ఈ మధ్యకాలంలో ప్రతిభ అవార్డుల స్థానంలో షైనింగ్ స్టార్స్ అని పేరు మార్చి ప్రతీ మండలానికి 6 చొప్పున అందచేస్తున్నారన్నారు. ప్రతీ సంవత్సరం విశ్వభారతి పాఠశాల విద్యార్థులకు ప్రతిభ అవార్డులు, షైనింగ్ స్టార్స్ అవార్డులు సాధించడం హర్షించ తగ్గ విషయమన్నారు. అయితే ఇటీవల విడుదలైన షైనింగ్ స్టార్స్ అవార్డులలో నలుగురు విద్యార్థులు జె.గోవర్ధన్, సి.వీణశ్రీ, ఆర్.లోహిత, ఎస్.మహ్మద్ తాహిర్, విద్యార్థులు విశ్వభారతి పాఠశాలకు చెందిన వారు కావడం ఎంతో గర్వకారణమన్నారు. ఈ షైనింగ్ స్టార్స్ అవార్డు సాధించిన ప్రతీ విద్యార్థికి ప్రభుత్వం 20,000 రూపాయలు నగదు, మెడల్, ప్రశంసా పత్రం అందచేస్తుందని ఆయన తెలియజేశారు. ఇంతటి ఘన విజయానికి కృషి చేసిన పాఠశాల ఉపాధ్యాయులకు, విద్యార్థులకు, తల్లితండ్రులకు ఆయన కృతజ్ఞతలు తెలియ జేశారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ రామచంద్రయ్య, కరస్పాండెంట్ రఘునాథరాజు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఆర్.రవీంద్ర, ఉపాధ్యాయులు, తల్లితండ్రులు, విద్యార్థులు, పాల్గొన్నారు.

# నాకు, అఖిల్, చైతన్యకి పండగలా ఉంది..
## ఇల్లంతా కళకళలాడుతూ ఉంది: నాగార్జున

- లెనిన్' బ్లాక్‌బస్టర్ విజయంపై 'వైభవం' పేరుతో సక్సెస్ మీట్
- ఇంట్లో పండగ వాతావరణం నెలకొందని చెప్పిన నాగార్జున
- అన్నగా, అభిమానిగా అఖిల్‌ను చూసి గర్వపడుతున్నానన్న నాగ చైతన్య
- కేవలం 3 రోజుల్లోనే బ్రేక్ ఈవెన్ సాధించిందని తెలిపిన చిత్రబృందం
- డిస్ట్రిబ్యూటర్లకు, యూనిట్ సభ్యులకు షీల్డులు అందజేత





అక్కినేని అఖిల్ ఎన్నాళ్లుగానో ఎదురుచూస్తున్న భారీ విజయం 'లెనిన్' రూపంలో వరించింది. ఈ ఆనందాన్ని పంచుకునేందుకు సోమవారం నాడు 'బ్లాక్ బస్టర్ వైభవం' పేరుతో చిత్ర బృందం విజయోత్సవ సభను ఘనంగా నిర్వహించింది. ఈ వేడుకలో అక్కినేని నాగార్జున, నాగ చైతన్య, అఖిల్ ఒకే వేదికపై కనిపించి అభిమానుల్లో ఉత్సాహం నింపారు. ఈ విజయం తమ కుటుంబంలో పండగ వాతావరణాన్ని తీసుకొచ్చిందని నాగార్జున భావోద్వేగంతో చెప్పగా, తమ్ముడి విజయాన్ని చూసి ఓ అన్నయ్యగా, అభిమానిగా గర్వపడుతున్నానని నాగ చైతన్య అన్నారు. ఈ వేడుకలో డిస్ట్రిబ్యూటర్లకు, చిత్ర బృందానికి షీల్డులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా నాగార్జున మాట్లాడుతూ.. "చాలా కాలం తర్వాత డిస్ట్రిబ్యూటర్లు, ఎగ్జిబిటర్లను పిలిచి ఇలా షీల్డులు ఇవ్వడం ఆనందంగా ఉంది. ప్రతిచోటా హౌస్ ఫుల్స్ పడుతున్నాయని ఫోన్లు వస్తుంటే ఎంతో సంతోషంగా ఉంది. మీకు (అభిమానులకు) ఎలా ఉందో తెలీదు కానీ, నాకు, అఖిల్, చైతన్యకు మాత్రం ఇంట్లో పండగలా ఉంది. ఇల్లంతా కళకళలాడుతోంది. ఈ ప్రేమ కోసం, ఈ అరుపుల కోసమే అఖిల్ ఎప్పటినుంచో ఎదురుచూస్తున్నాడు. ఆ ప్రేమను ప్రేక్షకులు, అభిమానులు తిరిగి చూపించారు. రైటర్ సత్యానంద్ గారు ఇచ్చిన ఇన్‌పుట్స్, అన్నపూర్ణ పోస్ట్ ప్రొడక్షన్ టీమ్ కష్టం ఈ సినిమా విజయంలో కీలక పాత్ర పోషించాయి. రెండు వారాల ముందే సినిమాను పోస్ట్ ప్రొడక్షన్‌కు ఇస్తే అద్భుతమైన అవుట్‌పుట్ వస్తుంది. అందరూ ఈ విషయాన్ని గమనించాలి" అని అన్నారు. నాగ చైతన్య మాట్లాడుతూ.. "తమ్ముడు కాస్త లేట్‌గా వచ్చినా, అభిమానులు మాత్రం లేటెస్ట్‌గా సపోర్ట్ చేశారు. కథ విన్నప్పుడే అఖిల్ సక్సెస్ కొట్టాడని ఫిక్స్ అయ్యాను. 'లెనిన్' పాత్రకు, అఖిల్‌కు ఎలాంటి సంబంధం ఉండదు. కానీ ఆ పాత్ర కోసం తను పూర్తిగా మారిపోయాడు. ఓ అన్నయ్యగా, అభిమానిగా అఖిల్‌ను చూస్తుంటే చాలా గర్వంగా ఉంది. నాన్నగారి ఫైర్ ఎలాంటిదో నాకు, అఖిల్‌కు బాగా తెలుసు. 'శివ', 'అన్నమయ్య', 'నిన్నే పెళ్లాడతా' వంటి చిత్రాలను ఆయన ఎంత డేరింగ్‌గా తీశారో, 'లెనిన్' విషయంలోనూ అదే డేరింగ్ చూపించారు. ఒక హీరోని ఎలా ప్రొజెక్ట్ చేయాలో నిర్మాత నాగవంశీకి బాగా తెలుసు. తమన్ తన సంగీతంతో సినిమాను మరో స్థాయికి తీసుకెళ్లాడు. నా బేబీ సిసింద్రీకి ఇంత పెద్ద హిట్ ఇచ్చిన ప్రేక్షకులకు మనస్ఫూర్తిగా ధన్యవాదాలు" అని తన ఆనందాన్ని పంచుకున్నారు. హీరో అఖిల్ అక్కినేని మాట్లాడుతూ.. "ఈ సినిమా గురించి ఇప్పటికే చాలా మాట్లాడాం. విడుదలైన రెండో రోజు నుంచే థియేటర్లు పెంచి మాకు మద్దతుగా నిలిచిన డిస్ట్రిబ్యూటర్లకు థాంక్స్. కేవలం మూడు రోజుల్లోనే మా సినిమా బ్రేక్ ఈవెన్ సాధించడం చాలా ఆనందంగా ఉంది.

ఈ సినిమా కోసం పనిచేసిన ప్రతి ఒక్కరికీ, మా కోసం వచ్చిన అక్కినేని అభిమానులకు, అన్నయ్యకు ప్రత్యేక ధన్యవాదాలు" అని తెలిపారు. అఖిల్, భాగ్యశ్రీ బోర్సే జంటగా నటించిన 'లెనిన్' చిత్రానికి మురళీ కిశోర్ అబ్బూరు దర్శకత్వం వహించారు. మనం ఎంటర్‌ప్రైజెస్ ఎల్‌ఎల్‌పి, సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్లపై నాగార్జున, సూర్యదేవర నాగవంశీ సంయుక్తంగా నిర్మించారు. జూలై 10న విడుదలై ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద ఘన విజయాన్ని నమోదు చేసుకుని, విజయవంతంగా ప్రదర్శించబడుతోంది. ఈ వేడుకలో నిర్మాత నాగవంశీ, దర్శకుడు మురళీ కిశోర్ తదితరులు పాల్గొని ప్రేక్షకులకు, డిస్ట్రిబ్యూటర్లకు కృతజ్ఞతలు తెలిపారు.



## మీ సినిమాలో నటించడానికి నేను రెడీ.. రాజమౌళికి పీవీ సింధు ఫన్నీ రిక్వెస్ట్

**జపాన్ ఓపెన్ గెలిచి చరిత్ర సృష్టించిన పీవీ సింధు**
**సింధును అభినందిస్తూ పోస్ట్ పెట్టిన దర్శకధీరుడు రాజమౌళి**
**మీ సినిమాలో నటించడానికి సిద్ధమంటూ సింధు రిప్లయ్**
**సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న వీరిద్దరి సంభాషణ**

భారత బ్యాడ్మింటన్ స్టార్, ఒలింపిక్ పతక విజేత పీవీ సింధు మరోసారి అంతర్జాతీయ వేదికపై త్రివర్ణ పతాకాన్ని సగర్వంగా ఎగురవేయడం తెలిసిందే. ప్రతిష్ఠాత్మక జపాన్ ఓపెన్ సూపర్-750 టోర్నమెంట్‌లో విజేతగా నిలిచి చారిత్రక ఘనతను అందుకుంది. నిన్న జరిగిన ఉత్కంఠభరిత ఫైనల్ మ్యాచ్‌లో ఆమె జపాన్‌కు చెందిన అగ్రశ్రేణి క్రీడాకారిణి అకనే యమగూచిపై పూర్తి ఆధిపత్యం ప్రదర్శించింది. హోరాహోరీగా సాగిన ఈ పోరులో సింధు 21-17, 21-17 తేడాతో వరుస సెట్లలో విజయం సాధించి టైటిల్‌ను కైవసం చేసుకుంది. ఈ విజయంతో జపాన్ ఓపెన్ గెలిచిన మొట్టమొదటి భారతీయ షట్లర్‌గా ఆమె సరికొత్త చరిత్ర సృష్టించింది. అయితే, ఈ చారిత్రక విజయం తర్వాత ఆమె సోషల్ మీడియాలో చేసిన ఒక వ్యాఖ్య క్రీడా, సినీ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది. సింధు అద్భుత విజయంపై స్పందించిన దర్శకధీరుడు ఎస్.ఎస్. రాజమౌళి ఆమెను ప్రశంసలతో ముంచెత్తారు. "ఇది నిజమైన ఛాంపియన్ కంబ్యాక్. నీ అద్భుత విజయానికి శుభాకాంక్షలు సింధు. దేశం మొత్తం నిన్ను చూసి గర్విస్తోంది" అంటూ సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. రాజమౌళి ప్రశంసలకు సింధు అంతే ఆసక్తికరంగా, చమత్కారంగా స్పందించింది. రాజమౌళికి ధన్యవాదాలు తెలిపిన సింధు, ఆయన దర్శకత్వంలో రాబోతున్న 'వారణాసి' చిత్రం కోసం ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నట్లు తెలిపింది. ఈ సందర్భంగా ఆమె రాజమౌళికి ఒక సరదా ఆఫర్ ఇచ్చింది. "భవిష్యత్తులో మీ కథల్లో ఎప్పుడైనా ఒక బ్యాడ్మింటన్ క్రీడాకారిణి పాత్ర అవసరమైతే, ఓ 'కొత్త నటి'గా మారడానికి నేను సంతోషంగా సిద్ధంగా ఉన్నాను" అంటూ ట్వీట్ చేసింది. ఈ ఊహించని ఆఫర్‌తో సింధు అందరి దృష్టిని ఆకర్షించింది. ప్రస్తుతం రాజమౌళి, సింధు మధ్య జరిగిన ఈ సంభాషణ సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. వీరిద్దరి కాంబినేషన్‌లో సినిమా వస్తే బాక్సాఫీస్ వద్ద కొత్త రికార్డులు ఖాయమని నెటిజన్లు కామెంట్లు పెడుతున్నారు. క్రీడా మైదానంలో ఛాంపియన్‌గా నిలవడమే కాకుండా తన చమత్కారంతో అందరినీ ఆకట్టుకుంటున్న సింధుపై ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి.



# ఓటమిని జీర్ణించుకోలేకపోయారా?..
## అర్జెంటీనా ప్రవర్తన సిగ్గుచేటంటున్న ఫుట్‌బాల్ ప్రపంచం!

- ఫిఫా వరల్డ్ కప్ 2026 ఫైనల్లో అర్జెంటీనాపై స్పెయిన్ విజయం
- ట్రోఫీ వేడుకలో స్పెయిన్‌ను అవమానించిన అర్జెంటీనా ఆటగాళ్లు
- ట్రోఫీ వేడుకకు వీపు చూపిన మెస్సీ సేన.. ఇది సిగ్గుచేటన్న విశ్లేషకులు
- గోల్డెన్ బాల్ అవార్డు సమయంలో మెస్సీ పేరుతో అభిమానుల నినాదాలు
- మ్యాచ్‌లో, ఆ తర్వాత ఇద్దరు అర్జెంటీనా ఆటగాళ్లకు రెడ్ కార్డులు



ఫిఫా ప్రపంచకప్ 2026 ఫైనల్లో స్పెయిన్ చేతిలో ఓటమి పాలైన తర్వాత డిఫెండింగ్ ఛాంపియన్ అర్జెంటీనా ప్రవర్తించిన తీరు తీవ్ర విమర్శలకు దారితీసింది. నిన్న న్యూయార్క్ న్యూజెర్సీ స్టేడియంలో జరిగిన హోరాహోరీ ఫైనల్లో స్పెయిన్ 1-0 తేడాతో అర్జెంటీనాను ఓడించి రెండోసారి విశ్వవిజేతగా నిలిచింది. అయితే, మ్యాచ్ అనంతరం జరిగిన పరిణామాలు ఫుట్‌బాల్ ప్రపంచంలో పెద్ద దుమారం రేపాయి. అర్జెంటీనా ఆటగాళ్లు, అభిమానుల ప్రవర్తన సంస్కారహీనంగా ఉందని, క్రీడాస్ఫూర్తికి మాయని మచ్చ తెచ్చిందని పలువురు విశ్లేషకులు మండిపడుతున్నారు. మ్యాచ్ ముగిసిన తర్వాత రన్నరప్ పతకాలు అందుకున్న అర్జెంటీనా ఆటగాళ్లు, కొత్త ఛాంపియన్లను అభినందించకుండా మైదానం నుంచి వెళ్లిపోయారు. స్పెయిన్ జట్టు ట్రోఫీని స్వీకరించేందుకు సిద్ధమవుతుండగా, లియోనెల్ మెస్సీ సహా అర్జెంటీనా ఆటగాళ్లందరూ మైదానంలో మరోవైపుకు వెళ్లి వీపు చూపిస్తూ నిలబడ్డారు. అంతకుముందు అర్జెంటీనా పతకాలు అందుకుంటున్నప్పుడు స్పెయిన్ ఆటగాళ్లు చప్పట్లతో అభినందనలు తెలిపినా, అర్జెంటీనా మాత్రం ఆ గౌరవాన్ని తిరిగి ఇవ్వలేదు. ఇది ఫుట్‌బాల్ అభిమానులను తీవ్ర నిరాశకు గురిచేసింది. ఇక, టోర్నమెంట్‌లో అత్యుత్తమ ఆటగాడిగా నిలిచిన స్పెయిన్ మిడ్‌ఫీల్డర్ రోడ్రి 'గోల్డెన్ బాల్' అవార్డు అందుకుంటున్నప్పుడు స్టేడియంలోని అర్జెంటీనా అభిమానులు 'మెస్సీ, మెస్సీ' అంటూ పెద్ద పెట్టున నినాదాలు చేశారు. ఈ పరిణామం అక్కడి వాతావరణాన్ని మరింత ఉద్రిక్తంగా మార్చింది. ఘటనలపై Goal.com కథనం ప్రకారం.. టాక్‌స్పోర్ట్ బ్రాడ్‌కాస్టర్ అడ్రియన్ డర్హమ్ తీవ్రంగా స్పందించారు. "వారిలో కనీస సంస్కారం లేదు. ఈ రోజు వారు సిగ్గుపడే రీతిలో ప్రవర్తించారు. ఫైనల్లో ఓటమిని వారు అంగీకరించలేకపోతున్నారు. అర్జెంటీనా జట్టు ఈ ఆటకు, ప్రపంచకప్‌కు పూర్తి అవమానం" అని ఆయన ఘాటుగా విమర్శించారు. "ప్రపంచకప్ చరిత్రలోనే అత్యంత సులువైన గ్రూప్‌లో డ్రా పొంది, నాకౌట్ దశలో కష్టపడి గెలిచి, ఇక్కడికొచ్చి తమను తాము అవమానించుకున్నారు" అని డర్హమ్ వ్యాఖ్యానించారు. టోర్నీ ఆద్యంతం అర్జెంటీనాకు అనుకూలంగా అనేక నిర్ణయాలు వచ్చాయని ఆయన ఆరోపించారు. నిజానికి ఫైనల్ ముగిసిన వెంటనే అర్జెంటీనా ఆటగాళ్లలో అసహనం కట్టలు తెంచుకుంది. దాంతో స్పెయిన్ ఆటగాళ్లపై దురుసుగా ప్రవర్తించారు. స్పెయిన్ ఆటగాళ్లతో గొడవకు దిగినందుకు లియాండ్రో పరేడెస్‌కు రెడ్ కార్డ్ చూపించారు. అంతకుముందు ఆట అదనపు సమయంలో ఎంజో ఫెర్నాండెజ్ కూడా రెండో ఎల్లో కార్డ్‌తో మైదానం వీడాడు. దీంతో ప్రపంచకప్ ఫైనల్లో రెడ్ కార్డ్ పొందిన ఆరో ఆటగాడిగా నిలిచాడు. ఈ విజయంతో స్పెయిన్ రెండోసారి ప్రపంచకప్ గెలవడమే కాకుండా వరుసగా 38 మ్యాచ్‌లలో అపజయం ఎరుగని యూరోపియన్ జట్టుగా రికార్డు సృష్టించింది. అయితే, స్పెయిన్ చారిత్రక విజయం కంటే అర్జెంటీనా వివాదాస్పద ప్రవర్తనే ఎక్కువగా చర్చనీయాంశంగా మారింది.



## అన్ని విమర్శలకు రోహిత్ శర్మ సమాధానం ఇదే...

**పాక్ మాజీ క్రికెటర్ ప్రశంసలు**

- ఇంగ్లండ్‌పై రోహిత్ శర్మ సెంచరీ అద్భుతమని కమ్రాన్ అక్మల్ ప్రశంస
- తన భవిష్యత్తుపై వస్తున్న ఊహాగానాలకు రోహిత్ బ్యాట్‌తోనే జవాబిచ్చాడని వ్యాఖ్య
- రోహిత్, కోహ్లీ ఎప్పుడు రిటైర్ అవ్వాలో వారే నిర్ణయించుకుంటారని పేర్కొన్న అక్మల్
- భారత ఓటమికి పేలవమైన బౌలింగే కారణమని విశ్లేషణ
- కుల్‌దీప్ యాదవ్‌ను ఆడించకపోవడం జట్టుకు నష్టం చేసిందని అభిప్రాయం

ఇంగ్లండ్‌తో జరిగిన మూడో వన్డేలో టీమిండియా ఓడినా, స్టార్ ఓపెనర్ రోహిత్ శర్మ చేసిన సెంచరీపై పాకిస్థాన్ మాజీ వికెట్ కీపర్ కమ్రాన్ అక్మల్ ప్రశంసల వర్షం కురిపించాడు. రోహిత్ భవిష్యత్తుపై వస్తున్న ఊహాగానాలకు, విమర్శలకు ఈ సెంచరీయే సరైన సమాధానమని అభిప్రాయపడ్డాడు. లార్డ్స్‌లో రోహిత్ (138) ఆడిన ఇన్నింగ్స్ ఒక "స్టేట్‌మెంట్ ఇన్నింగ్స్" అని, 50 ఓవర్ల ఫార్మాట్‌లో తానెందుకు అత్యుత్తమ బ్యాటర్లలో ఒకడో మరోసారి నిరూపించుకున్నాడని అక్మల్ అన్నాడు. "2027 ప్రపంచకప్ జట్టులో రోహిత్‌కు చోటు దక్కదంటూ వదంతులు వ్యాపించాయి. కానీ, ఈ రోజు తన బ్యాట్‌తోనే వాటన్నింటికీ రోహిత్ సమాధానం చెప్పాడు" అని అక్మల్ ఒక పాడ్‌కాస్ట్‌లో పేర్కొన్నాడు. రోహిత్, విరాట్ కోహ్లీ లాంటి గొప్ప ఆటగాళ్లు ఎప్పుడు తప్పుకోవాలో వారే నిర్ణయించుకుంటారని, ఎవరూ వారిని బయటకు పంపలేరని స్పష్టం చేశాడు. భారత క్రికెట్ కోసం ఎన్నో త్యాగాలు చేసిన వారిని ప్రదర్శన ఆధారంగా అంచనా వేయాలని సూచించాడు. అయితే, ఈ మ్యాచ్‌లో భారత ఓటమికి పేలవమైన బౌలింగే కారణమని అక్మల్ విశ్లేషించాడు. ప్రసిధ్ కృష్ణ, అర్ష్‌దీప్ సింగ్ వంటి బౌలర్లు భారీగా పరుగులు ఇవ్వడం, స్పిన్నర్ కుల్‌దీప్ యాదవ్‌ను ఆడించకపోవడం జట్టును దెబ్బతీసిందని అన్నాడు. "ప్రధాన బౌలర్లే 70 నుంచి 100 పరుగులు ఇస్తే మ్యాచ్ గెలవడం కష్టం. కుల్‌దీప్ ఉండుంటే వికెట్లు తీసి ఫలితాన్ని మార్చేవాడేమో" అని అభిప్రాయపడ్డాడు. ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన ఇంగ్లండ్ 387/5 భారీ స్కోరు చేయగా, భారత్ 360/7 వద్ద పరిమితమై 27 పరుగుల తేడాతో ఓటమిపాలైంది. దీంతో సిరీస్‌ను 2-1 తేడాతో ఇంగ్లండ్ కైవసం చేసుకుంది.

సూర్య వాస్తవం
Truth of News
http://www.suryavastavam.in



- ఐదు గ్రామాల దయనీయ పరిస్థితి
- ఆశలన్నీ ఈ ఒక్క దారిపైనే..!
- రోడ్డు లేక బురదలోనే జీవన ప్రయాణం..
- దశాబ్దాలుగా ఎదురుచూస్తున్న గ్రామస్తుల ఆవేదన
- "ప్రభుత్వాలు మారాయి.. నాయకులు మారారు.. కానీ మా దారి మాత్రం మారలేదు" అంటూ కన్నీటి గోడు

# బురద దాటితేనే బతుకు బండి..

**పెళ్లకూరు– సూర్య వాస్తవం :** తిరుపతి జిల్లా పెళ్లకూరు మండలంలోని గుర్రపుతోట, కప్పగుంట కండ్రిగ, పాలచూరు, జంగాలపల్లి, అనకవోలు గ్రామాల ప్రజలకు ఈ ఒక్క రహదారే జీవనాధారం. నిత్యావసరాల నుంచి అత్యవసర పరిస్థితుల వరకు ప్రతి అవసరానికీ ఇదే మార్గం. కానీ ఆ మార్గం నేడు ప్రజలకు వరం కాకుండా శాపంగా మారిందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఈ ఐదు గ్రామాల ప్రజలు ఉద్యోగాలు, ఉపాధి, వ్యాపార అవసరాల కోసం ప్రతిరోజూ నాయుడుపేట, శ్రీకాళహస్తి పట్టణాలకు వెళ్లాల్సి వస్తోంది. కంపెనీల్లో పనిచేసే కార్మికులు సమయానికి విధులకు చేరుకోవాలన్నా, రైతులు తమ వ్యవసాయ ఉత్పత్తులను మార్కెట్‌కు తీసుకెళ్లాలన్నా, విద్యార్థులు పాఠశాలలు, కళాశాలలకు వెళ్లాలన్నా, ఉద్యోగులు తమ కార్యాలయాలకు చేరుకోవాలన్నా ఈ ఒక్క రహదారే ఆధారం. అయితే వర్షాకాలం వస్తే ఈ దారి పూర్తిగా బురదమయంగా మారి రాకపోకలు దాదాపు నిలిచిపోయే పరిస్థితి నెలకొంటోందని వారు వాపోతున్నారు.

అత్యవసర పరిస్థితుల్లో పరిస్థితి మరింత దయనీయంగా మారుతోందని గ్రామస్తులు చెబుతున్నారు. ఎవరైనా తీవ్ర అనారోగ్యానికి గురైనా, గర్భిణీ మహిళలను ఆసుపత్రికి



తరలించాలన్నా, ప్రమాదాలు జరిగినప్పుడు అంబులెన్స్ గ్రామాలకు చేరుకోవాలన్నా ఇదే మార్గం కావడంతో ప్రతి నిమిషం ప్రాణాలతో పోరాటంగా మారుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సరైన రహదారి లేక అంబులెన్స్‌లు కూడా గ్రామాల్లోకి రావడానికి ఇబ్బందులు పడుతున్నాయని, కొన్నిసార్లు రోగులను చేతుల మీదుగా లేదా ఇతర వాహనాల్లో తీసుకెళ్లాల్సిన పరిస్థితులు ఎదురవుతున్నాయని తెలిపారు. అంతేకాదు, కుటుంబాల్లో శుభకార్యాలు, వివాహాలు, ఇతర సామాజిక కార్యక్రమాలకు వెళ్లాల్సి వచ్చినా ఇదే దారి. అయితే బురద, గుంతలు, నీటిమడుగులతో నిండిపోయిన రహదారిలో ప్రయాణించడం నరకయాతనగా మారిందని మహిళలు, వృద్ధులు, చిన్నారులు కన్నీటి పర్యంతమవుతున్నారు. ద్విచక్ర వాహనాలపై ప్రయాణించే వారు ప్రతిరోజూ ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని ప్రయాణిస్తున్నామని గ్రామస్తులు వాపోతున్నారు."ఎప్పుడు మా ఊరికి మంచి రోడ్డు వస్తుంది... ఎప్పుడు మా పిల్లలు బురదలో కాకుండా సురక్షితంగా పాఠశాలలకు వెళ్తారు... ఎప్పుడు మేము కూడా ఇతర గ్రామాల ప్రజల్లా గౌరవంగా ప్రయాణిస్తాం..." అనే ప్రశ్నలతో ఏళ్ల తరబడి ఎదురు చూస్తున్నామని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ సమస్యపై ఎన్నోసార్లు ప్రజాప్రతినిధులు, అధికారులకు వినతిపత్రాలు ఇచ్చామని, పలుమార్లు దృష్టికి తీసుకెళ్లామని, హామీలు తప్ప ఇప్పటి వరకు ఎలాంటి శాశ్వత పరిష్కారం లభించలేదని వారు పేర్కొన్నారు. "ప్రభుత్వాలు మారాయి... నాయకులు మారారు... కానీ మా జీవితాల్లో మాత్రం మార్పు రాలేదు. ప్రతి ఎన్నికల్లో రోడ్డు నిర్మిస్తామని చెబుతారు. ఎన్నికలు ముగిశాక మా గ్రామాల సమస్యను మరచిపోతారు" అంటూ గ్రామస్తులు నిరాశ వ్యక్తం చేస్తున్నారు. అయితే ప్రస్తుత ప్రభుత్వంపై మాత్రం తమకు ఇంకా నమ్మకం ఉందని గ్రామస్తులు చెబుతున్నారు. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందనే విశ్వాసంతో తమ సమస్యను కూడా అత్యవసరంగా పరిష్కరిస్తుందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. గుర్రపుతోట, కప్పకుంట కండ్రిగ, పాలచూరు, జంగాలపల్లి, అనకవోలు గ్రామాలకు శాశ్వత బీటీ రహదారి నిర్మించి, దశాబ్దాలుగా పడుతున్న కష్టాలకు ముగింపు పలకాలని వారు ప్రభుత్వాన్ని హృదయపూర్వకంగా విజ్ఞప్తి చేస్తున్నారు. "రోడ్డు అనేది కేవలం ప్రయాణానికి మాత్రమే కాదు... మా పిల్లల భవిష్యత్తుకు, మా రైతుల జీవనాధారానికి, మా కుటుంబాల భద్రతకు, మా ఐదు గ్రామాల అభివృద్ధికి ప్రాణాధారం. మా గోడును ప్రభుత్వం ఆలకించి వెంటనే రహదారి నిర్మాణం చేపట్టాలి" అని గ్రామస్తులు విజ్ఞప్తి చేశారు.



# శ్రీ జగన్నాథ్ రథయాత్ర మహోత్సవంలో పాల్గొన్న మంత్రి సత్యకుమార్

**దొరవారిసత్రం – సూర్య వాస్తవం :** రాష్ట్ర వైద్య,ఆరోగ్య అండ్ కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ సోమవారం ధర్మవరంలో ఇస్కాన్ (ఇస్కకాన్) ఆధ్వర్యంలో నిర్వహించిన శ్రీజగన్నాథ రథయాత్ర మహోత్సవంలో పాల్గొని శ్రీజగన్నాథ స్వామి,శ్రీ బలరాముడు, శ్రీ సుభద్రాదేవి ఉత్సవ విగ్రహాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.అనంతరం భక్తులతో కలిసి రథాన్ని లాగుతూ శ్రీ జగన్నాథ స్వామివారి ఆశీస్సులు ధర్మవరం నియోజకవర్గ ప్రజలతో పాటు రాష్ట్ర,దేశ ప్రజలందరిపై ఎల్లప్పుడూ ఉండాలని ప్రార్థించారు.ఈ సందర్భంగా ప్రపంచవ్యాప్తంగా ఎల్‌నినో (ఈయల్ ఎన్ఐఎన్ఓ)ప్రభావంతో ఏర్పడుతున్న వాతావరణ మార్పుల నేపథ్యంలో ప్రజలు ఎదుర్కొంటున్న సవాళ్లను ప్రస్తావిస్తూ, సాగునీరు,తాగునీటి సమస్యల నుంచి ప్రజలను కాపాడాలని శ్రీ జగన్నాథ స్వామిని ప్రార్థించారు. ఆధ్యాత్మిక చైతన్యాన్ని విస్తరించడంతో పాటు అన్నదాన కార్యక్రమాలు, సేవా కార్యక్రమాలు, ప్రకృతి



వైపరీత్యాల సమయంలో సహాయక చర్యల ద్వారా సమాజానికి విశిష్ట సేవలందిస్తున్న ఇస్కాన్ సంస్థ సేవలను అభినందించారు. మానవ సేవే మాధవ సేవ అనే స్ఫూర్తితో సేవలందిస్తున్న ఇస్కాన్ నిర్వాహకులను



అభినందిస్తూ,ప్రతి కుటుంబంలో ఆయురారోగ్యాలు, సుఖశాంతులు, అష్టైశ్వర్యాలు వెల్లివిరియాలని, పిల్లల భవిష్యత్తు ఉజ్వలంగా ఉండాలని శ్రీ జగన్నాథ స్వామిని మంత్రి సత్యకుమార్ యాదవ్ ప్రార్థించారు.

## 37మంది విద్యార్థులకు షైనింగ్ స్టార్స్ అవార్డుల ప్రదానం





**దొరవారిసత్రం – సూర్య వాస్తవం :** శ్రీ పద్మావతి మహిళా విశ్వ విద్యాలయంలో సోమవారం తిరుపతి జిల్లాలోని వివిధ మండ లాలకు చెందిన విద్యార్థులకు షైనింగ్ స్టార్స్ అవార్డుల ప్రధానోత్సవం కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సూళ్లూరుపేట నియోజకవర్గంలోని 37 మంది విద్యార్థులకు జిల్లా ఇన్చార్జి మంత్రి అనగాని సత్య ప్రసాద్,సూళ్లూరుపేట ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ,జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్ వెంకటేశ్వర్‌లు సైనింగ్ స్టార్స్ అవార్డుల తోపాటు 20000 రూపాయల ప్రోత్సాహక నగర బహు మతు లను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ సైనింగ్ స్టార్స్ ప్రశంసా పత్రాలు అందుకున్న విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో తిరుపతి ఎమ్మెల్యే ఆరని శ్రీనివాసులు రైల్వే కోడూరు ఎమ్మెల్యే అరవ శ్రీధర్, రాష్ట్ర యాదవ కార్పొరేషన్ ఛైర్మన్ నరసింహ యాదవ్, పలువురు అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

## బాధితుడి కుటుంబాన్ని పరామర్శించిన మాజీ మంత్రి బుగ్గన

**- ఆర్థిక సాయం అందజేత**



**ప్యాపిలి – సూర్య వాస్తవం :** ప్యాపిలి మండలం నల్ల మేకల పల్లె గ్రామంలో గత కొద్ది రోజుల క్రితం గొర్రెలను కాపాడడానికి వెళ్ళిన సమయంలో నీటి కుంటలో పడి మరణించిన కురువ చిన్న నాగన్న కుటుంబ సభ్యులను మన రాష్ట్ర మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి పరామర్శించి వారి కుటుంబానికి ఆర్థిక సహాయాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో వైయస్సార్సీపి రాష్ట్ర మీట్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ శ్రీరాములు డోన్ మండలం అధ్యక్షుడు సోమేశ్ యాదవ్ రాష్ట్ర వ్యవసాయ విభాగం కార్యదర్శి మెట్టు వెంకటేశ్వర రెడ్డి జిల్లా యూత్ విభాగం ఉపాధ్యక్షుడు గజేంద్రనాథ్ రెడ్డి అలెబాద్ బాలయ్య బోరెడ్డి పుల్లారెడ్డి బోరా మల్లికార్జున రెడ్డి, బోరెడ్డి రాము ప్రేమ్ సాగర్ రెడ్డి, ఇతర గ్రామాల నాయకులు వైసిపి నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## తాతకు తగ్గ మనవరాలు...!

**- తాత బాటలో మనవరాలు మల్లికా**




**దేవనకొండ–సూర్య వాస్తవం :** దేవనకొండ మండలం తరుపున షైనింగ్షైనింగ్ స్టార్ అవార్డు కు ఎంపిక అయింది హోసూర్‌కు చెందిన రిటైర్డ్ హెడ్ మాస్టర్ వెంకటరామి రెడ్డి మనవరాలు ఎస్ శివ మల్లిక పదవ తరగతి పలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు రాష్ట ప్రభుత్వం అందించే సైనింగ్ స్టార్ అవార్డుకు దేవనకొండ మండలం లోని ఎఫ్ అర్ హై స్కూల్లో విద్యార్థిని, ఎస్.శాంతి రెడ్డి, ఎస్. లక్ష్మిల కుమార్తె ఎస్. శివ మల్లిక ఎంపికైంది దేవనకొండ గ్రామానికి చెందిన ప్రముఖ రిటైర్డ్ హెడ్ మాస్టర్ వెంకటరామి రెడ్డి మనవరాలు ఆయన పేరు నిలబెట్టిందంటూ కుటుంబ సభ్యులు గ్రామస్థులు కొనియాడారు ఇలాగే భవిషతులోనూ ముందుకు వెళ్తూ కుటుంబానికి గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు

## దిగుబడి ఆధారిత భీమా పథకం సద్వినియోగం చేసుకోండి

**- "ఏఓ జ్యోతిర్మయి"**



**దొరవారిసత్రం – సూర్య వాస్తవం:** మండల పరిధిలోని వ్యవసాయదారులు దిగుబడి ఆధారిత బీమా పథకం(పిఎంఎఫ్‌బివై) సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి కిరణ్మయి సూచించారు. మండల పరిధిలోని అన్నదాతలందరూ వరి, సజ్జ పునర్వ్యవస్థీకరించబడిన వాతావరణ బీమా పథకం (ఆర్డబ్ల్యూఎస్ బి సి ఐ ఎస్) క్రింద వేరుశనగ, నిమ్మ పంట ఎంపిక చేయబడినవి.వరి పంటకు గ్రామాన్ని భీమా యూనిట్ గా,వేరుశనగ,నిమ్మ పంటలకు మండల భీమా యూనిట్‌గా పరిగణలోకి తీసుకుంటారని అన్నారు. తిరుపతి జిల్లా పరిధిలో వరి,సజ్జ పంటలకు జనరల్ సెంట్రల్ ఇన్సూరెన్స్ కంపెనీ లిమిటెడ్, వేరుశనగ, నిమ్మ పంటలకు గాను ఈ ఫోటోకి జనరల్ ఇన్సూరెన్స్ కంపెనీ లిమిటెడ్ ఏజెన్సీలుగా ఉంటాయని వెల్లడించారు.వరి పంటకు ఎకరానికి బీమా మొత్తం రూ,42000లో రైతు కట్టవలసిన ప్రీమియం సొమ్ము రూ.168 చెల్లిస్తే చాలని వివరించారు. వేరుశనగ పంటకు మాత్రం1 ఎకరానికి మొత్తం బీమా రూ.28000 కాగా రూ.547 చెల్లించాలని చెప్పారు. వరి పంట భీమా చెల్లించడానికి ఆగస్టు 15 లోపు గడువు పెట్టగా, వేరుశనగ పంటకు మాత్రం 31 జులై నెలతో భీమా చెల్లించే గడువు ముగుస్తుందని తెలియజేశారు.పంట రుణం తీసుకోవాలనుకున్న రైతులు సిఎస్సి సెంటర్ ద్వారా ఎన్సీఐపి పోర్టల్ నందు నమోదు చేసుకోవాలని పేర్కొన్నారు.

1)రైతు విశిష్ట సంఖ్య తప్పనిసరిగా ఉండాలి 2) ఆధార్ కార్డు 3) పట్టాదారు పాసుపుస్తకం 4) కావులు రైతులు అయితే సిసిఆర్సిపి పత్రం 5) మొబైల్ నంబర్ 6) రైతు స్వీయ ధ్రువీకరణ పత్రం 7) రైతు యొక్క సేవింగ్ బ్యాంక్ అకౌంట్ అన్ని డాక్యుమెంట్లు అవసరమని తెలియపరిచారు.

## హైదరాబాద్ సిటీ న్యూరో సెంటర్ పాటిల్ సురేష్‌ని పరామర్శించిన గుంతకల్ నియోజకవర్గం జనసేన పార్టీ సమన్వయకర్త వాసగిరి మణి కంఠ

**గుత్తి – సూర్య వాస్తవం :**

జనసేన పార్టీ గుత్తి పట్టణ అధ్యక్షుడు, మాముడూరు సింగల్ విండో చైర్మన్ పాటిల్ సురేష్ ఉన్నట్టుండి బ్రెయిన్ సంబంధిత జబ్బుకు గురై, సర్జరీ నిమిత్తం హైదరాబాద్ సిటీ న్యూరో సెంటర్లో ఉన్న ఆయనను పరామర్శించి మెరుగైన చికిత్స అందించాలని డాక్టర్‌తో మాట్లాడి అనంతరం వారి కుటుంబ సభ్యులతో మాట్లాడుతూ ధైర్యంగా ఉండాలని మీకు అన్ని రకాలుగా



జనసేన పార్టీ, కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని శ్రీవాసగిరి మణికంఠ భరోసా నిచ్చారు.

ఈ కార్యక్రమంలో గుంతకల్ పట్టణ అధ్యక్షుడు బండి శేఖర్, జిల్లా కార్యక్రమాల నిర్వహణ కమిటీ సభ్యుడు పవర్ శేఖర్, జనసేన పార్టీ సీనియర్ నాయకులు గాజుల రాఘవేంద్ర, అమర్ తదితరులు పాల్గొన్నారు.

PRINTED AND PUBLISHED OWNED BY MOGAL IRSHAD BAIG, ON BEHALF OF IRS PUBLICATIONS ADDRESS : # DOOR NO-4-29-A-19-12-, DONTHI STREET, MADANAPALLI, ANNAMAYYA, CHITTOOR, ANDHRA PRADESH - 517325. CELL : 9885404140 ( ASSOCIATE EDITOR -Mohammad Shafi Ahamad 9948461699 )

# ఆటస్థలం లేని ప్రైవేట్ స్కూళ్లకు అనుమతులు ఎలా?




కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే వివిధ మాధ్యమాల ద్వారా రాష్ట్రంలోని పాఠశాలల్లో ప్లే గ్రౌండ్స్ సౌకర్యంపై 2025 లో ఓ విద్యార్థి నుంచి వచ్చిన వినతిని పరిశీలించిన ప్రభుత్వం స్పందించి రాష్ట్రంలో ప్లే గ్రౌండ్స్ లేని స్కూళ్లను గుర్తించి వివరాలు ఇవ్వాలని అధికారుల్ని ఆదేశించడంతో పాటు వాటిలో సాధ్యమైనంత త్వరగా ఈ సౌకర్యం కల్పించాలని కూడా ఆదేశించింది. ఇంత చెప్పిన మన జిల్లా విద్యాశాఖ అధికారులు ఎన్ని పాఠశాలలు గుర్తించారో వారికే తెలియాలి..... ఇక ప్రైవేట్ పాఠశాలల విషయానికి వస్తే విద్యా హక్కు చట్టం ప్రకారం పాఠశాలకు ప్లేగ్రౌండ్ తప్పనిసరి. అనంతపురం నగరంలోని చాలా ప్రైవేట్ పాఠశాలలకు ఆటస్థలం లేకపోయినా విద్యాశాఖ అధికారులు అమ్యామ్యాలు పుచ్చుకొని అనుమతులు ఇచ్చారనే వాదనలు ఉన్నాయి. డిఈఓ, డిప్యూటీ ఈవో గ్రౌండ్ లెవెల్లో తలుఖీలు చేయకపోవడంతో ఆట స్థలం లేని పాఠశాలలు బయటపడటం లేదు. ఒకవేళ బయటపడిన మన విద్యాశాఖ అధికారులు చూసి చూడనట్టు వ్యవహరిస్తున్నారని వాదనలు బలంగా వినిపిస్తున్నాయి.

### - నిబంధనలు ఒకలా... అమలు మరోలా?
### - విద్యార్థుల ఆరోగ్యంపై తల్లిదండ్రుల ఆందోళన
### - పట్టించుకోని విద్యాశాఖ అధికారులు..!

**అనంతపురం కలెక్టరేట్ - సూర్య వాస్తవం :** విద్యార్థుల మానసిక, శారీరక వికాసంలో ఆటలకు కీలక స్థానం ఉన్నప్పటికీ, జిల్లాలోని అనేక ప్రైవేట్ పాఠశాలలు కనీస ఆటస్థలం లేకుండానే కొనసాగుతున్నాయనే విమర్శలు వినిపిస్తున్నాయి. భారీ ఫీజులు వసూలు చేస్తున్న కొన్ని పాఠశాలలు బహుళ అంతస్తుల భవనాల్లోనే తరగతులు నిర్వహిస్తూ, పిల్లలకు ఆడుకునే అవకాశాన్ని కల్పించలేకపోతున్నాయని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**ఆటస్థలం ఎందుకు అవసరం?**

వైద్య నిపుణుల అభిప్రాయం ప్రకారం ప్రతిరోజూ కనీసం 45 నిమిషాల నుంచి గంటపాటు పిల్లలు శారీరక క్రీడల్లో పాల్గొనడం అవసరం. ఇది ఊబకాయం, మధుమేహం, ఒత్తిడి వంటి సమస్యలను తగ్గించడమే కాకుండా జట్టు భావన, నాయకత్వ లక్షణాలు, ఆత్మవిశ్వాసాన్ని పెంచుతుంది.

**నిబంధనలు ఏమంటున్నాయి?**

ప్రైవేట్ పాఠశాలలకు గుర్తింపు ఇచ్చే సమయంలో భవనం, తరగతి గదులు, తాగునీరు, మరుగుదొడ్లు, భద్రత, క్రీడా సదుపాయాలు వంటి అంశాలను అధికారులు పరిశీలించాల్సి ఉంటుంది. అవసరమైన మౌలిక వసతులు ఉన్నాయనే ధృవీకరణ అనంతరమే అనుమతులు ఇవ్వాల్సి ఉంటుంది. అయితే, వాస్తవ పరిస్థితులు దీనికి భిన్నంగా ఉన్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

**తనిఖీలు జరుగుతున్నాయా?**

గుర్తింపు ఇచ్చిన తర్వాత పాఠశాలల్లో అధికారులు క్రమం తప్పకుండా తనిఖీలు నిర్వహిస్తున్నారా? లోపాలు గుర్తిస్తే హెచ్చరికలు, జరిమానాలు లేదా గుర్తింపు రద్దు వంటి చర్యలు తీసుకుంటున్నారా? అనే ప్రశ్నలు తల్లిదండ్రుల్లో తలెత్తుతున్నాయి.

**తల్లిదండ్రుల డిమాండ్**

పాఠశాలల ప్రచార బ్రోచర్లు, వెబ్‌సైట్లలో చూపిస్తున్న సదుపాయాలు నిజంగానే ఉన్నాయా లేదా అన్న విషయాన్ని అధికారులు పరిశీలించాలని వారు కోరుతున్నారు. ఆటస్థలం లేని పాఠశాలలకు ప్రత్యామ్నాయంగా సమీప క్రీడా మైదానాలతో ఒప్పందాలు ఉన్నాయా అనే విషయాన్ని కూడా తనిఖీ చేయాలని సూచిస్తున్నారు.

**విద్యావేత్తల అభిప్రాయం**

"మార్కులు మాత్రమే విద్యకు ప్రమాణం కాదు. పిల్లల శారీరక ఎదుగుదల, సామాజిక నైపుణ్యాలు, మానసిక ఆరోగ్యం కూడా సమానంగా ముఖ్యం. ఆటస్థలం లేని పాఠశాలలు ఈ అంశంలో వెనుకబడే ప్రమాదం ఉంది" అని విద్యావేత్తలు అభిప్రాయపడుతున్నారు.

**అధికారులు ఏం చేయాలి?**

- జిల్లాలోని అన్ని ప్రైవేట్ పాఠశాలలపై ప్రత్యేక తనిఖీలు నిర్వహించడం.
- మౌలిక వసతులపై నివేదికలను ప్రజలకు అందుబాటులో ఉంచడం.
- నిబంధనలు పాటించని యాజమాన్యాలకు గడువు విధించి లోపాల సవరణకు ఆదేశాలు ఇవ్వడం.
- నిబంధనలను నిర్లక్ష్యం చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకోవడం.

**తల్లిదండ్రుల ఆవేదన**

"పిల్లల భవిష్యత్తు కోసం ఏర్పాటు చేసిన విద్యాసంస్థల్లో కనీస ఆటస్థలం కూడా లేకపోతే, అలాంటి పాఠశాలలకు అనుమతులు ఎలా లభిస్తున్నాయి?" అనే ప్రశ్నకు సంబంధిత అధికారులు స్పష్టమైన సమాధానం ఇవ్వాల్సిన అవసరం ఉందని తల్లిదండ్రులు కోరుతున్నారు.

# పారిశుధ్య కార్మికుల ఆత్మబంధు డిస్కవర్ అనంతపురం అనిల్ కుమార్

- ప్రాణాలను పణంగా పెట్టి నగరాన్ని పరిశుభ్రంగా ఉంచుతున్న అసలైన హీరోలకు భద్రతా చేయూత
- డంప్‌యార్డ్ పారిశుద్ధ కార్మికులకు ఎన్-95 మాస్కులు, గ్లవ్స్ పంపిణీ చేసిన డిస్కవర్ అనంతపురం వ్యవస్థాపకుడు ఏ.జీ. అనిల్ కుమార్



**అనంతపురం - సూర్య వాస్తవం :** సమాజంలో అత్యంత నిర్లక్ష్యానికి గురవుతున్న వర్గాల్లో ఒకటైన డంప్‌యార్డ్ ర్యాగ్ పికర్ల ఆరోగ్య రక్షణ కోసం డిస్కవర్ అనంతపురం వ్యవస్థాపకుడు లిఏ.జీ. అనిల్ కుమార్లి వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. అనంతపురం డంప్‌యార్డ్‌లో అత్యంత ప్రమాదకర పరిస్థితుల్లో విధులు



నిర్వహిస్తున్న పారిశుద్ధ కార్మికులకు ఎన్-95 మాస్కులు, సర్జికల్ మాస్కులు, రక్షణ గ్లవ్స్పంపిణీ చేసి వారి ఆరోగ్య భద్రతకు చేయూత అందించారు. ఈ కార్యక్రమంలో అనంతపురం మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ (ఎంహెచ్ఓ) పాల్గొని ర్యాగ్ పికర్లకు రక్షణ సామగ్రిని పంపిణీ చేశారు. వారికి 10 రోజుల పాటు సరిపడా భద్రతా సామగ్రిని అందజేయగా, ఈ పంపిణీ కార్యక్రమాన్ని ప్రతి పది రోజులకు ఒకసారి నిరంతరంగా నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. భద్రతా సామగ్రిని క్రమం తప్పకుండా వినియోగించేలా ప్రోత్సహించేందుకు ప్రత్యేక ప్రోత్సాహక పథకాన్ని కూడా ప్రకటించారు. రక్షణ మాస్కులు, గ్లవ్స్‌ను నిత్యం ధరించే మహిళా ర్యాగ్ పికర్లకు రైస్ కుక్కర్లు వంటి ఆకర్షణీయమైన బహుమతులు అందజేయ నున్నట్లు ఏ.జీ. అనిల్ కుమార్ వెల్లడించారు. ఈ సందర్భంగా ఏ.జీ. అనిల్ కుమార్ మాట్లాడుతూ.....డంప్‌యార్డ్‌లో పనిచేస్తున్న ర్యాగ్ పికర్లే మన సమాజంలోని నిజమైన గుర్తింపు లేని హీరోలు. వారు ప్రతి రోజూ తమ ప్రాణాలను సైతం పణంగా పెట్టి ప్రమాదకర వ్యర్థాల మధ్య పనిచేస్తూ నగరాన్ని పరిశుభ్రంగా ఉంచుతున్నారు. మనం ఆరోగ్యంగా జీవించేందుకు వారు చేస్తున్న సేవ అమూల్యమైనది. వారి ఆరోగ్య భద్రతను కాపాడటం మనందరి సామాజిక బాధ్యత అని పేర్కొన్నారు. నగర పరిశుభ్రత, వ్యర్థాల వేరు చేయడం, రీసైక్లింగ్ ప్రక్రియలో ర్యాగ్ పికర్లు పోషిస్తున్న పాత్ర ఎంతో కీలకమైందని, అయినప్పటికీ వారి ఆరోగ్యం, భద్రతపై పెద్దగా దృష్టి సారించకపోవడం బాధాకరమని ఆయన అన్నారు. డంప్‌యార్డ్‌లో పనిచేసే ర్యాగ్ పికర్ల సంక్షేమం కోసం ఒక వ్యక్తి స్వచ్ఛందంగా ముందుకు వచ్చి భద్రతా సామగ్రి పంపిణీ చేయడం, వాటి వినియోగాన్ని ప్రోత్సహించేందుకు బహుమతులు ప్రకటించడం వంటి కార్యక్రమం అత్యంత అరుదైనదని పలువురు అభినందించారు. ప్రజారోగ్యం, పర్యావరణ పరిరక్షణతో పాటు సమాజంలో అత్యంత వెనుకబడిన వర్గాల సంక్షేమం పట్ల డిస్కవర్ అనంతపురం మరోసారి తన సామాజిక బాధ్యతను చాటుకుందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

## చట్టం, బాల్య వివాహాలు, సైబర్ మోసాలు రోడ్డు భద్రత సూత్రాలు, స్త్రీరక్ష యాప్‌లపై అవగాహన



**గుత్తి - సూర్య వాస్తవం:** గుత్తి అనంతపురం ఎస్పి జగదీశ్ సూచనల మేరకు, గుంతకల్ ఎస్డీపీవో శ్రీనివాస్, గుత్తి ఇన్‌స్పెక్టర్ ఎం.రామారావు, సిబ్బంది ఆధ్వర్యంలో సోమవారం గుత్తి మండలం, తొండపాడు గ్రామంలో ప్రజలతో సమావేశం ఏర్పాటు చేసి వారికీ డ్రగ్స్ (గంజాయి) వాడితే కలిగే దుష్ప్రభావాలు, మహిళలపై జరుగు నేరాలు, పిల్లలపై జరుగు నేరాలు, పోక్సో(పిఓ సిఎస్ ఓ)చట్టం, బాల్యవివాహాలు, సైబర్ మోసాలు, రోడ్డు భద్రత సూత్రాలు, స్త్రీరక్ష యాప్ మొదలగు వాటిపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించామని అన్నారు. అలాగే అప్రమత్తంగా ఉండాలని, అలాగే వారి కుటుంబ సభ్యులకు కూడా పై విషయాలు తెలియజేసి, వారు కూడా అప్రమత్తంగా ఉండేటట్లు చూడాలని తెలియపరచడం జరిగింది. అటువంటి సంఘటనలు ఏవైనా జరిగితే వాటి గురించి పోలీస్ వారికీ తెలియజేయాలని వారికి సూచించామన్నారు.

## జులై 31 లోపల ఇన్కమ్ టాక్స్ ఈ ఫైలింగ్ చేసుకోవాలి



**గుత్తి - సూర్య వాస్తవం:** గుత్తి రాష్ట్ర ప్రభుత పెన్షనర్లు అంద రు 31.07.2026 లోపల ఈ ఫైలింగ్ చేయాలి మీరిటర్న్ న్యూరీజిమ్‌లో అయితే రూ,12,75,000 వరకు ఇన్‌కం టాక్స్ పడదు. అందుకని అక్కర్ లేదులే అనుకోకండి. నిల్ రిటర్న్ ఫైల్ చేయాలి.గడువు తరు వాత అయితే రూ,5000 పెనాలిటి పడుతుంది నిర్లక్ష్యం చేయకండని పెన్షనర్స్ అసోసి యేషన్ ప్రెసిడెంట్ అబూబాకర్, కోశాధికారి జెన్నే కుల్లాయిబాబు తెలిపారు.


## జగన్ 2.0 సూపర్ యాప్" పోస్టర్‌ను ఆవిష్కరించిన శ్యామల



**హైదరాబాద్ - సూర్య వాస్తవం :** వైసీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, ప్రముఖ నటి శ్యామల వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చిన "జగన్ 2.0 సూపర్ యాప్" పోస్టర్‌ను హైదరాబాద్ నగరంలోని స్థానిక గాజులరామారంలో ఆవిష్కరించారు. పార్టీని, కార్యకర్తలను, ప్రజలను ఒకే డిజిటల్ వేదికపైకి తీసుకురావాలనే లక్ష్యంతో రూపొందించిన ఈ యాప్ ప్రచా రంలో భాగంగా ఆమె ఈ పోస్టర్ లాంచ్ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ యాప్ ద్వారా పార్టీ కార్యకర్తలు నేరుగా పార్టీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డితో అనుసంధానమై ఉండే అవకాశం ఉంది. ప్రతి ఇంటికీ ఈ యాప్‌ను తీసుకెళ్లాలని, ప్రజా సమస్యల పరిష్కారానికి దీనిని సమర్థవంతంగా వినియోగించుకోవాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు.

## "సోషల్ మీడియా" నీకో దండం

### - ఇన్‌స్టాగ్రామ్ డిలీట్ చేసింది, ఆల్ ఇండియా 20వ ర్యాంక్ సాధించిన వైష్ణవి దాస్
### - సోషల్ మీడియాని వీడండి, ర్యాంకులు సాధించండి
### - సోషల్ మీడియా మాయలో యువత జీవితాలు నాశనం
### - ఇన్‌స్టాగ్రామ్, ఫేస్బుక్, వాట్సప్ వద్దు, చదివే ముద్దు



**బెంగళూరు- సూర్య వాస్తవం:** దేశంలో యువత అందరు సోషల్ మీడియా పై ఆసక్తితో తమ జీవితాలను నాశనం చేసుకుంటున్నారు. చదువుకునే వయసులో ఎక్కువ సమయం చదువు కేటాయించాల్సింది పోయి, "సోషల్ మీడియా" ఇంస్టాగ్రామ్ ఫేస్బుక్ వాట్సప్ లో ఎక్కువ సమయం కేటాయించి వారి సమయాన్ని వృధా చేసుకుంటున్నారు. సోషల్ మీడియాకు ఉపయోగించే సమయాన్ని నిజంగా చదువుకు ఉపయోగిస్తే ఏం జరుగుతుందో కర్ణాటకకు చెందిన వైష్ణవి దాస్ నిరూపించింది."సోషల్ మీడియాకు దూరంగా ఉండి క్రమశిక్షణతో చదివితే అనుకున్న లక్ష్యాన్ని సాధించవచ్చు అని కర్ణాటక చెందిన వైష్ణవి దాస్ నిరూపించారు. నీట్ రీటెస్ట్ 2026 లో 720 మార్కులకు 700 మార్కులు తెచ్చుకొని ఆల్ ఇండియా 20 వరకు సాధించింది. వైష్ణవి దాస్ మాట్లాడుతూ,, తాను ఇంస్టాగ్రామ్ కు దూరంగా ఉండటం వల్లనే ఈ ర్యాంకు సాధించానని చెప్పుకొచ్చింది. నా విజయానికి ప్రశంసలు అందించిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు. సోషల్ మీడియా మాయలో పడి యువత చదువుపై ఆసక్తి చూపడం తగ్గింది. యువత ఇప్పుడుకైనా మేల్కొని సోషల్ మీడియా వదిలిపెట్టి చదువుపై మక్కువ చూపండి.

**తల్లిదండ్రుల ఆవేదన**

ప్రతి తల్లిదండ్రి తమ పిల్లల్ని ఎంతో ప్రయోజకుల్ని చేయాలని, తమ కష్టాన్ని పిల్లలకు తెలియ కుండా చదివిస్తూ ఉంటే పిల్లలు మాత్రం సోషల్ మీడియాకు అలవాటు పడి సమయాన్ని వృధా చేసుకొని ఫెయిల్యూర్ జీవితానికి దగ్గరవుతున్నారు. యువత తల్లిదండ్రుల గురించి కూడా ఆలోచించి అలా జరగకుండా చూసుకోవాలని కోరారు. కర్ణాటకకు చెందిన వైష్ణవి దాసుని ఆదర్శంగా తీసుకొని యువత మారాలని తల్లిదండ్రులు ఆకాంక్షించారు.

## హంద్రీ-నీవాపై వైసీపీ విమర్శలు..

### - కమిషన్ల కోసమే టీడీపీ ఆరాటమని ఆరోపణ




**అనంతపురం సిటీ - సూర్య వాస్తవం :** హంద్రీ-నీవా కాలువ పరిశీలన యాత్రతో టీడీపీ ఉలిక్కిపడిందని, ప్రజల ఉనికిని కాపాడటమే వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ లక్ష్యమని వైసీపీ నాయకులు పేర్కొన్నారు. అనంతపురంలోని వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో రాయలసీమ జోనల్ అధికార ప్రతినిధి కె.వి. రమణ మాట్లాడుతూ, ప్రజల సమస్యలు, ప్రభుత్వ వైఫల్యాలు, ప్రజాధన దుర్వినియోగాన్ని ప్రజలకు తెలియజేయడమే తమ పోరాటమని అన్నారు. టీడీపీ నాయకులు హంద్రీ-నీవా ప్రాజెక్టుపై అసత్య ప్రచారం చేస్తున్నారని ఆరోపించిన ఆయన, 2014--2019 మధ్య మొదటి దశకు తక్కువ నిధులు కేటాయించి, రెండో దశలో గత ప్రభుత్వ పనులకే బిల్లులు చెల్లించారని విమర్శించారు. గత ఏడాది 60 టీఎంసీల నీరు తీసుకొచ్చామని చెబుతున్నా, ప్రభుత్వ లెక్కల ప్రకారం 51 టీఎంసీలే వచ్చాయని పేర్కొన్నారు. ఆ నీటితో ఎంత సాగు జరిగిందో, ఎంతమంది రైతులకు ప్రయోజనం కలిగిందో ప్రభుత్వం వెల్లడించాలని డిమాండ్ చేశారు. రెండో దశ లైనింగ్ పనుల్లో కాలువ సామర్థ్యాన్ని తగ్గించి రైతులకు అన్యాయం చేశారని, నాసిరకం పనులు, కమిషన్ల కోసం ప్రాజెక్టు రూపురేఖలు మార్చారని ఆరోపించారు. వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నాణ్యమైన పనులకే ప్రాధాన్యం ఇచ్చారని, పూర్తి సామర్థ్యంతో కాలువ నిర్మించాలని సూచించారని తెలిపారు. వైఎస్ రాజశేఖర్ రెడ్డి హయాంలో వేగంగా సాగిన హంద్రీ-నీవా ప్రాజెక్టు, అనంతరం ఎందుకు నత్తనడకన సాగిందో, రూ.4 వేల కోట్లతో పూర్తికావాల్సిన ప్రాజెక్టుకు రూ.18 వేల కోట్లకు పైగా ఖర్చైనా ఎందుకు పూర్తికాలేదో బహిరంగ చర్చకు సిద్ధమా అని టీడీపీ నాయకులకు సవాల్ విసిరారు. ఈ సమావేశంలో రాయలసీమ జోనల్ అధికార ప్రతినిధి కె.వి. రమణ నగర అధ్యక్షుడు చింతా సోమశేఖర్ రెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి సీపీ వీరన్న, కూడేరు మండల అధ్యక్షుడు బైరెడ్డి రామచంద్రారెడ్డి పాల్గొన్నారు.